# పరకాల అభివృద్ధి ఎమ్మెల్యే రేవూరితోనే సాధ్యం : ఎంపీపీ

**నవతెలంగాణ-గీసుగొండ**

పరకాల నియోజకవర్గ అభివద్ధి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని పరకాల కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, భీమగాని సౌజన్య అన్నారు. మండలంలోని కొనాయిమాకుల సదాశివ వేడుకల మందిరంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామశాఖల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో కొమురారెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలలో పరకాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డికి గీసుగొండ మండల ప్రజలు అత్యధిక మెజారిటీ ఇచ్చారని ఎమ్మెల్యే రేవూరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యత ఉం టుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రేవూరి బాటలోనే నడిచి రాబోయే లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూసం, రమేష్, దూలం వెంకన్న, ఆకుల రుద్రప్రసాద్, పత్తిపాక రవీందర్,వజ్ర రాజు, దౌడు ప్రవీణ్, నరేష్ , కందికొండ రాజు, నవీన్, సాయి, రాంబాబు, వెంకటేశ్వర్లు, బద్రు నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## రెండవ రోజు మూడు నామినేషన్లు



**నవతెలంగాణ-వరంగల్**

లోక్ సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియాలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ముగ్గురు అభ్యర్థులు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయని వరంగల్ ఎస్సీ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ పీ. ప్రావీణ్య నేడొక ప్రకటనలో తెలిపారు.ఏ ఆర్ నేనా ప్రేమ్ రెడ్డి రిపిక మన తెలంగాణ రాష్ట్ర సమక్య పార్టీ అభ్యర్థి గా ఒక్క సెట్ ,అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థిగా ఒక్క సెట్ మొత్తం రెండు సెట్లు నామిఇనేషన్లు వేశారు.స్వతంత్ర అభ్యర్థి గా పేరంబుదూరి కృష్ణ సాగర్ ఒక్క సెట్ నామినేషన్ వేశారు.బీఎస్ పీ అభ్యర్థిగా పంజా కల్పన ఒక్క సెట్ నామినేషన్ వేశారు.కాగా ఇప్పటికి గురువారం మూడు, శుక్రవారం నాలుగు నామినేషన్లు మొత్తం ఆరుగురు అభ్యర్థులు ఏడు నామినేన్లు వేశారు.

## ఔట్‌సోర్సింగ్ పోస్టులకు ధరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ-నర్సంపేట**

నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పోస్టులకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.కిషన్ తెలిపారు. డిసెక్షన్ హాల్ అటెండర్‌లు 4 పోస్టులకై 10వ తరగతి లేదా సమాన పరీక్షల్లో ఉత్తీర్ణలై ఉండాలని, అనాటమీ డిసెషన్ లేదా ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో కనీస ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ల్యాబ్ అటెండర్‌లు 4 పోస్టులకు గుర్తింపు కలిగిన విశ్వవిద్యాలయం నుంచి బీఎస్‌సీఎంఎల్‌టీ / డీఎంఎల్‌టీలో డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండి తప్పని సరిగా తెలంగాణ పారామెడికల్ బోర్డులో గుర్తింపు నమోదై ఉండాలని తెలిపారు. థియేటర్ అనస్థీషియా అసిస్టెంట్ 4 పోస్టులకు అనస్థీషియా అసిస్టెంట్ కోర్సులో బీఎస్‌సీఎంఎల్‌టీ / ఎంఎల్‌టీ ఉత్తీర్ణలై తెలంగాణ మెడికల్ బోర్డులో గుర్తింపు నమోదై ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24 సాయంత్రం 5గంటలోపు దరఖాస్తుతో పాటు ఒక జత సర్టిఫికెట్ జిరాక్స్‌లను ఏరియా ఆసుపత్రిలో అందజేయాలని తెలిపారు. ఈ పోస్టుల నియామకంలో మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తిస్తుందని, మరిన్ని వివరాలకై 08718-230226 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

## పరీక్షల నిర్వహణను పరిశీలించిన ఎంఎంఓ

**నవతెలంగాణ-పర్వతగిరి**



మండల కేంద్రం లోని స్థానిక విజడం పాఠశాల, లయోలా, కేజీబీవి,మోడల్ స్కూల్ తదితర పాఠశాలను శుక్రవారం పర్వతగిరి మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి పాఠశాలలలో నిర్వహించబడుతున్న సమ్మే టివ్-2 పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. మూల్యాంకనం పూర్తి చేసి పాఠశాలల చివరి పనిదినం రోజున విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిసిఓ జయరాజ్ తదితరులు ఉన్నారు.

## సోమేశ్వర ఆలయంలో కల్యాణ మండపం నిర్మాణం

**నవతెలంగాణ-పర్వతగిరి**



మండలంలోని ఏనుగల్ గ్రామంలోని సోమేశ్వర ఆలయంలో దాత చెర్విరాల సోమ నరసయ్య చంద్రకళ దంపతులు ఆయన తల్లిదండ్రులు సత్తమ్మరత్తయ్య జ్ఞాపకార్థం శుక్రవారం సోమేశ్వర కళ్యాణ మండప నిర్మాణాన్ని చేపట్టారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణం చేసి శుక్రవారం ప్రారంభోత్సవం చేసి గ్రామ ప్రజలకు అప్పగించారు.గతం లో కూడా గ్రామంలో దన్‌మెట్టుగుట్ట ఆంజనేయస్వామి ఆలయం వద్ద నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ చేయించారు.ఇలాగే గత ఆరు సంవత్సరాల నుండి గ్రామానికి 40 లక్షల విరాళంతో దేవస్థానాలకు సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా సోమ నర్సయ్య దంపతులకు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బాగంగా గ్రామ పెద్దలు తక్కలపల్లి నారాయణరావు, భాస్కర్‌రావు, బొంపల్లి దేవేందర్ రావు తదితరులు కలిసి ఆయనకు ఘన సన్మానం చేశారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

**నవతెలంగాణ-ఖానాపురం**



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధి లోని బుధరావుపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీవో ఈగల భారతి పరిశీలించారు. రానున్న ఎన్నికల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సిబ్బందికి తెలియజేశారు. పోలింగ్ కేంద్రాలలో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే చోట ఉన్న పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన తలెత్తకుండా తగినఏర్పాట్లు చేసి, ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దోమల రజిత, బిఎల్‌ఓ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదు

**నవతెలంగాణ-నల్లబెల్లి**



ఎక్కడ ఎన్ని సంవత్సరాలు పనిచేసిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదు అని నల్లబెల్లి మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు అన్నారు. మండలం లోని శనిగరం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఉప్పు సదాశివరావు పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయునికి జ్ఞాపికను అందించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు విరమణ పొందిన సదాశివరావు ఉపాధ్యాయునికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు నటరాజ్, ఉపాధ్యాయులు సుధాకర్, మహేందర్, సుధారాణి, మంజుల, సుల్తానా, బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటింగ్‌శాతం పెంచేందుకు ప్రత్యేకచర్యలు : కలెక్టర్




**నవతెలంగాణ-వరంగల్**

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైందని ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరు తమ ఓటును ఉపయోగించుకోవాలని జిల్లా ఎన్నికలఅధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. వరంగల్ పట్టణంలో ఓటింగ్‌శాతం పెంచేందుకు జిల్లా పాలన యంత్రాంగం చేపడుతున్న చర్యల్లో భాగంగా వరంగల్ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద శుక్రవారం కలెక్టర్ పి.ప్రావీణ్య అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్‌లతో కలిసి సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ కలెక్టర్ మాట్లాడుతూ గత 20 18 లోక్‌సభ, 2019, 2023 శాసనసభ ఎన్నికల్లో వరంగల్ నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని ఓటింగ్‌శాతాన్ని పట్టణంలో పెంచేందుకు వినూత్న కార్యక్రమాల ద్వారా కళాజాత, 5కెరన్, ముగ్గుల పోటీలు, ముఖ్యంగా క్యాంపస్ అంబాసిడర్లను కళాశాలలో నియమించి యువఓటర్లు అధికంగా ఓటు వేసేలా వివిధ ప్రసారమాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారంచేస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నా రు. అందులో భాగంగా జిల్లా కలెక్టరేట్ తో పాటు పబ్లిక్ గార్డెన్స్ వద్ద, వరంగల్ రైల్వే, బస్‌స్టేషన్ వద్ద సెల్ఫీపాయింట్లు ఏర్పాట్లు చేసి యువకులను ఆకర్షించి ఓటు నమోదుశాతం పెంచుటకు చర్యలు తీసు కుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిసిఓ సంజీవ రెడ్డి, ఏఓ శ్రీకాంత్, కాలెక్టరేట్ పర్యవేక్షకులు విశ్వ నారాయణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులు, సలహాలు సూచనలకై పరిశీలకులను సంప్రదించాలి

వరంగల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజా ప్రతి నిధులు ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చు అని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఫిర్యాదు లు ఎన్నిల వ్యయ పరిశీలకులు ధీలిబన్ మొబైల్ నంబర్ 83099 21306కు ఫిర్యాదు చేయాల ని వివరించారు.

అదే విధంగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి సెగ్మెంట్లకు ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ధీరజ్‌సింగా మొబైల్ నంబర్ 830 9952057కు ఫిర్యాదులు చేయవచ్చుఅని అన్నారు. ఈనెల 24 నుండి హన్మకొండ హరిత హోటల్ లోని సూట్‌నంబర్ 309లో వ్యయ పరిశీలకులు ఎ.ధీలి బన్ ను, సూట్ నంబర్ 314లో వ్యయ పరిశలకులు ధీరజ్ సింగ్‌ను సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్య నేరుగా కలువ వచ్చు అని తెలిపారు.

# ఎంపీగా కడియం కావ్యకు భారీ మెజార్టీ ఖాయం : రేవూరి



**నవతెలంగాణ-నడికూడ**

వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా కడియం కావ్య గెలుపు ఖాయమని వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల నియోజకవర్గం నడికుడ మండల కేంద్రంతో పాటు గొల్లపల్లెకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ 30 మంది నాయకులు, అలాగే నడికూడ మండల ముదిరాజ్ సొసైటీ చైర్మన్ తాళ్లశ్యామ్ రాజ్ నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఎప్పుడో ఖాయం అయిందని, భారీమెజార్టీ లక్ష్యంగా ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల ప్రధాన కార్యదర్శి కుడ్ల మలహల్‌రావు, నడికూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్ల నవీన్, నడికుడ మండల మహిళా అధ్యక్షురాలు భోగం కమల, మండల యూత్ అధ్యక్షులు అప్పం కుమారస్వామి, పరకాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏర్ల చిన్ని, నడికూడ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దుప్పటి సదానందం, ఓబి సి జిల్లా హనుమకొండ కన్వీనర్ బొమ్మ చంద్రమౌళి, నడికూడ మండల సీనియర్ నాయకులు నారగాని కుమారస్వామి, వాక్య రాయన్న, యువ నాయకుడు రావులసురేష్, గ్రామ సమన్వయ కమిటీ సభ్యురాలు నీరటి రజిత, గ్రామ ప్రధాన కార్యదర్శి జీల శ్రీనివాస్, మండల సమన్వయ కమిటీ సభ్యులు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ స్టాండర్డ్ ప్రకారం నాణ్యత ప్రమాణాలు ఉండాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

**నవతెలంగాణ-వరంగల్**

ఇండియన్ (భారత) స్టాండర్డ్ ప్రకారం నాణ్యత ప్రమాణాలు ఉండాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. శుక్రవారం బాలసముద్రంలోని బల్దియా క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలో కమీషనర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి నాణ్యత ప్రమా ణాల తీరును పరిశీలించి నాణ్యత నిర్ధారణ విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఐఎస్ ప్రమాణాల ఆధారంగా నాణ్యత నిర్ధారణ జరగాలని, ఎప్పటి కప్పుడు నూతన విధానాలను అధ్యయనం చేస్తూ నాణ్యతను నిర్ధారించాలని, మిషనర్ కు కోర్ కటింగ్ చేసే విధానాన్ని చేసి చూపించారు.ఇట్టి కార్యక్రమంలో ఈ ఈ సంజయ్ కుమార్ ఏఈ కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధిహామీ డబ్బులు రాక కూలీల ఇబ్బందులు



**నవతెలంగాణ-నల్లబెల్లి**

కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలకు పనిని కల్పించి డబ్బులు అందించే జీవనాధారంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రారంభించింది. సంవత్సరంలో 100 రోజులు కూలీని కల్పించి వారంలో కూలీ డబ్బులు వచ్చే విధంగా ఉండేది. ప్రస్తుతం నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు రాక గ్రామీణ ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధిహామీ కూలీలలో ప్రతిరోజు గిట్టుబాటు అవుతున్న కాకున్నా పనిని నమ్ముకుని జీవనాన్ని కొనసాగిస్తున్న కుటుంబాలు చాలా ఉన్నాయి. సరియైన సమయంలో కూలి డబ్బులు రాకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రంలోని పెద్ద చెరువు ప్రాంతం లో ఉపాధి పనుల పనిప్రదేశాన్ని 'నవతెలంగాణ' సందర్శించగా పనులు నిర్వహి స్తున్న కూలీలు వేతనాలురాక, సరైన సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్ల క్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక సొమ్మ సిల్లిపోయిన నీడ ప్రదేశాలు లేవన్నారు. మంచినీటి సౌకర్యం కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం :



**నాగేల్లి బాబు, కూలీ**

ఉపాధి హామీ డబ్బులతోనే జీవనాన్ని సాగించే కుటుంబం కొన్ని నెలలుగా డబ్బులు రాకపోవడంతో అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా ప్రభుత్వం కూలీ డబ్బులను అందించాలని అన్నారు.

### వారానికోసారి డబ్బులు ఇవ్వాలి :



**ఉడుత భాస్కర్, కూలీ**

తీవ్రమైన ఎండలలో వడదెబ్బ సహితం తట్టుకొని ఉపాధి హామీ పనులు చేస్తున్నాం సరైన కూలీ రావడం లేదు. వారానికి ఒకరోజు కూలి డబ్బులు అందిస్తే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు.

## జర్నలిస్టు శ్రీనివాస్‌కు ఎర్రబెల్లి పరామర్శ

**నవతెలంగాణ-పర్వతగిరి**

సీనియర్ జర్నలిస్టు దొడ్డ శ్రీనివాస్ తండ్రి దొడ్డ సోమయ్య ఇటీవల అనారోగ్యం తో మరణించగా శుక్రవారం రాయపర్తి మండలం లోని కొత్తూరు లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో దారం పూర్ణచందర్,సోమనాథం, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పర్వతగిరికి మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు సోమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ కార్యక్రమం లో జిల్లా కోఆప్టెడ్ సభ్యులు మహ్మద్ సర్వర్, నాయకులు వంగాల రవీందర్,గోనెసంపత్,రంగు కుమార్,లూనావత్ భీలునాయక్,డైరెక్టర్ లక్ష్మీ నారాయణ, దారం పూర్ణచందర్,సోమనాథం తదితరులు పాల్గొన్నారు.



## వ్యయ రికార్డులను పటిష్టంగా నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.ధీలిబన్



**నవతెలంగాణ-వరంగల్**

ఎన్నికల సంబధించిన ఖర్చుల రికార్డులను పటిష్టంగా నిర్వహించాలని ఎన్నిక వ్యయ పరిశీలకులు ఎ.ధీలిబన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హన్మకొండ కుడా కాంప్లేక్స్ జిల్లా సహకార కార్యాలయంలో ఏర్పాటు చేసిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కార్యాలయాన్ని సందర్శించి నిర్వహిస్తున్న వ్యయరికార్డులను ఆయన పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ వ్యయ పరిశీలకుల అధికారులతో సమన్వయం చేసుకొని ఆర్ఓస్థాయిలో ప్రతీరోజు వ్యయ నివేదికలను క్రోడీకరించుకోవాలన్నారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఆర్డీఓ ఏఆర్ఓ కార్యాలయాలను వ్యయపరిశీలకులు సందర్శించి ఎన్నికల వ్యయ నమోదు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పోటీచేయు రాజకీయపార్టీలు,అభ్యర్థుల ఆమోద,ఆమోద యోగ్యం కాని ప్రతి ఖర్చుల వివరాలను సహయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్, వీఎస్‌టీ, వీవీటీలు సెగ్మెంట్ల వారిగా నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ద్వారా నిర్వహించు ర్యాలీలు బహిరంగా సభలు. సమావేశాలు, రోడ్ షో అన్నింటిని వీడియో సర్వేలైన్స్ టీమ్ సభ్యులు రికార్డు చేసివీడియో పరిశీలించి వివరాలను అకౌంటింగ్ సభ్యులతో సమన్వయం చేసుకొని షాడో అబ్జర్వేషన్ రిజిష్టర్‌లో తప్పకుండా నమోదుచేసి పూర్తి వివారాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. ర్యాలీలు, సమావేశాల పార్టీ ప్రచారఖర్చులు నిర్వహించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. పరిశీలనకు మధ్య మూడురోజుల వ్యవధి ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యయ నోడల్ అధికారి నామిరెడ్డి, సహాయ నోడల్ అధికారి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**నవతెలంగాణ-చెన్నారావుపేట**



దొంగిలించిన తులం బంగారం 30 తులాల వెండి 50 కిలోల బియ్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని మండల మల్లికాంబ భర్త మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె నివాసం ఉంటున్న ఇంటిని వదిలి అదే కాలనీలో వేరే ఇంట్లో అద్దెకు ఉంటుంది. వదిలి పెట్టిన ఇంటిలో ఎవరు లేకపోవడంతో దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన కోల నరసయ్య ఆదివారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంటి తాళం ధ్వంసం చేసి ఇంట్లో చొరబడి బీరువా పగలగొట్టి 1 తులంబంగారం, 30 తులాల వెండి, 50 కిలోల బియ్యం దొంగిలించినట్లు తెలిపారు. దీంతో మల్లికాంబ సోమవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై గూడ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కోనాపురం గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న నర్సయ్యను విచారించగా అసలు విషయం బయటపడింది. దొంగిలించిన బంగారం వెండి బియ్యం ఇదే గ్రామానికి చెందిన చెల్లెలు ఇంట్లో దాచిపెట్టినట్లు తెలిపాడు. నగలు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నరసయ్య పై కేసు నమోదు చేసినట్లు సిఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ కేసును త్వరగా చేజిక్కించిన ఎస్ఐ, సిబ్బందినీ సీఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేష్, సల్మాన్ పాషా, నరేష్, యాకయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి

**నవతెలంగాణ-నెక్కొండ**



మహబూబాద్ పార్లమెంట్ లో జరిగిన సమావేశంలో జన జాతర కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి కలిసి సీఎంను సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి నర్సంపేట నియోజకవర్గంలో నెక్కొండ మండలం నుండి ఎంపీ అభ్యర్థికి భారీ ఓట్ల మెజార్టీని అందిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా సీఎం కు రంజిత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

## రేపు టీఎస్ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలు

**నవతెలంగాణ-హసన్‌పర్తి**

తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలలో ఈ నెల 21న ఆది వారం ప్రవేశ పరీక్ష కొరకై టిఎస్ ఆర్ జెసిసెట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్, హసన్‌పర్తి టిఎస్‌ఆర్‌జెసి సెట్ బాలికల ప్రిన్సిపాల్ ఇందుమతి తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రవేశపరీక్ష హాల్ టికెట్‌లను వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకొని అభ్యర్థులు ప్రవేశ పరీక్ష కేంద్రానికి 1గంట ముందు చేరుకోవాలని ఆమె తెలిపారు. ఇతర సమాచారం కొరకై 9866559727 నెంబరును సంప్రదించాలని ఆమె తెలిపారు.

## మద్యంపట్టివేత : నలుగురిపై కేసు నమోదు

**నవతెలంగాణ-కమలాపూర్**

అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురుపై కేసు నమోదు చేసినట్లు సిఐ హరికృష్ణ తెలిపారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నమ్మదగిన సమాచారం మేరకు మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన గట్టు అనిల్, ముంజ యుగంధర్, పోరండ్ల కుమారస్వామి, పోరండ్ల రఘుపతిల ఇండ్లలో అక్రమంగా మధ్యాన్ని కలిగి ఉన్నారని సమాచారం మేరకు తనిఖీ చేయగా గట్టు అనిల్ వద్ద రూ.9150 విలువగల మద్యం, ముంజ యుగంధర్ వద్ద రూ.8830లు విలువగల మద్యం, పోరండ్ల కుమారస్వామి వద్ద రూ.5490 విలువగల మద్యం, పోరండ్ల రఘుపతి వద్ద 13,990 రూపాయల విలువగల మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురుపై కేసునమోదు చేసి అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్



**నవతెలంగాణ-వేలేరు**

మండల కేంద్రం వేలేరులోని ఐకెపి ఆధ్వర్యంలో జరిగే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ శుక్రవారం సందర్శించారు. మండల కేంద్రం వేలేరులో ఐకెపి, సొసైటీ ద్వారా రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సివిల్ సప్లై అధికారులతో కలిసి సందర్శించి ఐకేపీ ఆధ్వర్యంలో జరిగే కొనుగోలు కేంద్రంలోని ల్వఉన్న ధాన్యం పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి మిల్లును కేటాయించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఐకెపి అధికారులను కలెక్టర్ వివరాలు అడగగా ధాన్యంకు తేమశాతం కరెక్ట్‌గా రాకపోవడం చేత ఆరబెట్టడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఐకేపీ ఆధ్వర్యంలో ఎటువంటి దాన్యం కొనుగోలు జరగలేదని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు ఎంపీడీవో లక్ష్మీ ప్రసన్న జిల్లా సివిల్ సప్లై అధికారులు, ఐకెపి అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్తఫాపూర్‌లో వాతావరణ నిర్ధారిత పథకం

**నవతెలంగాణ-భీమదేవరపల్లి**



మండలంలోని ముస్తఫాపూర్ గ్రామంలో ఏకేవిఆర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాతావరణ నిర్ధారిత పథకాన్ని నాబార్డ్ డీడీఎం ఎల్ చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. పథకం ఏర్పాటు ద్వారా వాతావరణ మార్పులు ప్రతికూల తీవ్రత తగ్గించడం మెరుగైన భూసార నీటి సంరక్షణ పశు జీవాల ఉత్పాదికత మెరుగుపరచడం లో దోహదం చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ముల్కనూర్ సొసైటీ జనరల్ మేనేజర్ మార్పాటి రామ్ రెడ్డి ఎంసీఆర్సీ ప్రాజెక్టు మేనేజర్ టి దేవేందర్ రైతులు వాటర్ షెడ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు

**నవతెలంగాణ-శాయంపేట**



వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేం ద్రాలు ఎంత దోహదపడతాయని ప్రజ్వల్ సంస్థ ఫీల్డ్ ఫెసిలిటర్ పోతు సునీల్ అన్నారు. మండలంలోని గంగిరేణి గూడెం గ్రామంలో ప్రజ్వల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ మండు వేసవిలో ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందున రైతులు తమ పంట క్షేత్రాలలో ఉదయం 5 గంటల నుండి 11 వరకు, సాయంత్రం 5 గంటల తర్వాత పనులు చేసుకోవాలని, ఎండతీవ్రత అధికంగా ఉన్నందున వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్ హద్దురాళ్ల తొలగింపు

**నవతెలంగాణ-ఆత్మకూరు**



మండలంలోని కొత్తగట్టు గ్రామంలో సుమారు రెండు ఎకరాల్లో వేసిన అక్రమ లేఅవుట్ హద్దు రాళ్ళను మండల పంచాయతీ అధికారి సి.చేతన్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం తొలగించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఏపీఓ కోరారు. ప్రభుత్వ అనుమతులు లేని వెంచర్లు, లేఅవుట్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కళ్యాణి, శ్రీకాంత్, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో ఆరుగురు విద్యార్థుల డిబార్

**నవతెలంగాణ-సుబేదారి**

హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కళాశాలలో శుక్రవారం నిర్వహిస్తున్న సెమిస్టర్ రసాయన శాస్త్రం పరీక్షలో మాస్ కాపీంగు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ పుల్ల రమేష్ తెలిపారు.

## మహిళ అదృశ్యం కేసు నమోదు

**నవతెలంగాణ-ఆత్మకూరు**



భార్యాభర్తల గొడవతో భార్య ఇంటి నుండి వెళ్లిపోయిన సంఘటన మండలంలోని హౌజుబుజుర్గు గ్రామంలో జరిగింది. పోలీస్ కథనం ప్రకారం మండలంలోని హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన సయ్యద్ సమీనా (28) భర్త సలీంతో ఇంట్లో గోడవపడి గురువారం ఉదయం ఇంటి నుండి తన తల్లి ఇంటికి వెళుతున్న అని చెప్పి వెళ్ళి శుక్రవారం సాయంత్రం వరకు కూడా ఇంటికి రాకపోవడంతో బంధువులను విచారించినా లేకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ క్రాంతి కుమార్ తెలిపారు.

## పాఠశాల సమావేశపు హాలు ప్రారంభం

**నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ**



కాజీపేట్ (జాగీర్), దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆధునీకరించిన సమావేశపు హాలును పాఠశాల పూర్వ విద్యార్థి, వరంగల్ ఎంజీఎం సూపరింటెంట్ కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వలుపదాస్ చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. జాతీయ సైన్స్ దినోత్సవం రోజు ఇచ్చిన హామీ మేరకు పాఠశాల సమావేశ గది పునరుద్ధరణకు ఒక లక్ష విరాళం ఇచ్చి పెయింటింగ్, మెటల్ డోర్స్, మెటల్ విండోస్ మిగతా రిపేరు పనులు ప్రధానోపాధ్యాయులు ఎన్ఎంఎం స్వామి ఆధ్వర్యంలో దర్గా కాజీపేట పుర ప్రముఖులు పూర్వ విద్యార్థులు అయినా రాజమోహన్ సమ్మయ్య యాకూబ్ స్వామి దాస్ భాస్కర్ తదితరుల పర్యవేక్షణలో పనులు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఆయనను మెమెంటో ,శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులైన రాజమోహన్, సమ్మయ్య యాకూబ్, స్వామిదాస్, భాస్కర్, స్టాఫ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు టి.సంతోష్ కుమారి, యం.సుమలత, బి.సతీష్ పాల్, బి.సునీత, ఎ.మహేష్, ఎస్పి.అంబాప్రసాద్, రామ్మోహన్, వరలక్ష్మి తదితర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీపరులకు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- అదాలత్ జంక్షన్‌లో మానవహారం
- ఓటు నమోదు శాతాన్ని పెంచాలి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నవతెలంగాణ-హన్మకొండ**

పార్లమెంట్ ఎన్నికల్లో నిజాయితీ పరులకు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మే 13న జరగబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు జిల్లాల్లో వివిధ రూపాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ శుక్రవారం అదాలత్ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మానవహారం, ప్రతిజ్ఞ అనంతరం ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వారు కోరుకునే సుస్థిరమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్నీ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

సమర్థత, పారదర్శకత, బాధ్యతాయుతంగా, జవాబుదారితనం కలిగిన నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. అయితే ఓటరు మాత్రం నాయకులిచ్చే కానుకలు, డబ్బులకు లొంగకుండా తల్లిలాంటి ఓటును అమ్ముకొని మోసపోవద్దని, తాత్కాలిక అవసరాలకు లొంగిపోయి ఓటు వేస్తే ప్రశ్నించే అవకాశాన్ని కోల్పోయే అవకాశం ఉందని అన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం సక్రమంగా నడవాలంటే ఓటర్లే కీలకమని ఆలోచించి, ఆత్మశోధన చేసుకొని ఓటు వేయాలన్నారు. ఈఎన్నికల నేపథ్యంలో శారీరక దివ్యాంగులు, చూపులేని, బధిరులకు వారి ఓటు హక్కును వినియోగించుకొనుటకు వీల్‌చైర్, ర్యాంపు, సంకేతభాష, బ్రెయిలీ లిపి బ్యాలెట్ పేపర్ లాంటి సౌకర్యాలు, వయోవృద్ధులకు వలంటీర్ల సహాయం అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లా నోడల్ అధికారి, క్షేత్ర స్థాయి అధికారులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుటకు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు పాడిన ఓటమ్మ ఓటు ఓటమ్మ ఓటు చందా మామయ్యలో, ప్రజాస్వామ్య మనుగడకు ఓటుఆయుధం తదితర పాటలు ఆకట్టుకున్నాయి. ఓటు ఫర్ ష్యూర్, నేను తప్పకుండా ఓటు వేస్తాను, లాంటి నినాదాలతో అదాలత్ ప్రాంతం మారుమోగింది, అనంతరం జిల్లా ఉన్నతాధికారులు గాలిలోకి బెలూన్లని వదిలివేసారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, రాధికా గుప్త,అసిస్టెంట్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డిఆర్డీవో నాగపద్మిని, జిల్లా సంక్షేమ అధికారి కే మధురిమ, అడిషనల్ డిఆర్డీవో శ్రీనివాస రావు, బిసి సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామ్ రెడ్డి, పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులు భాను ప్రసాద్, ఐఅండ్‌పిఆర్ డిఈ భూపాల్‌రెడ్డి, జిల్లా స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ పసునూరి సంపత్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, సెర్ప్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు ఎండిపోయే... సాగునీరు అందకపాయే





- 100 ఎకరాల్లో ఎండిపోయిన వరి పంట
- ఆర్థికంగా నష్టపోయిన అన్నదాతలు
- నష్టపరిహారం చెల్లించాలని రైతుల వేడుకోలు

**నవతెలంగాణ-శాయంపేట**

ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట గొలుసు వేసి పాల దశలో ఉండగా, సాగునీరు అందక వ్యవసాయ నేలలు బీటలు వారుతున్నాయి. మరో 25రోజుల్లో చేతికి అంది వస్తుందనుకున్న పంటలు రైతుల కళ్ళముందే ఎండిపోతున్నాయి. పంట సాగుకుపెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక రైతులు అప్పుల ఊబిలో కురుకుపోతున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. మండలంలోని వసంతాపూర్‌లోని మోద్దులచెరువు కింద 200 ఎకరాలు ఆయకట్టు సాగవుతుండగా, రబి సీజన్లో 100 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ప్రస్తుతం పంట గొలుసులు వేసి పాల దశకు చేరుకున్నాయి. చెరువులో నీరుపూర్తిగా అడుగంటి పోవడంతో చెరువు నీటిపై ఆధారపడి సాగుచే సిన వరి క్షేత్రాలు రైతుల కళ్ళముందే పూర్తిగా ఎండిపోతున్నాయి. వ్యవసాయ బావుల్లో, బోర్లలో నీరు అడుగంటిపోవడంతో రైతులు పంటలను కాపాడలేక పోతున్నారు. పంట సాగుకు ఎకరాకు రూ.30 వేల ఖర్చు అయిందని, పంటలు పూర్తిగా ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగుతడుల నీరు అందించినట్లయితే మరో 25 రోజుల్లో పంట చేతికి అంది వస్తుందని, నీరు లేకపంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్వే నెంబర్ 89/ ఈ, 89/ ఎఫ్ లో మూడుఎకరాల వరి పంట సాగు చేయగా గొలుసులు వేసి పాల దశకు చేరుకుందని, ఎకరాకు 30 వేల ఖర్చు వచ్చిందని, మోద్దుల చెరువులో నీరు అడుగంటి పోవడంతో సాగునీరు అందక పంట పూర్తిగా ఎండిపోవడంతో ఆవులను మేపుతున్నట్లు రైతు ముక్కెర సుధాకర్ తెలిపారు.

**ఎస్సారెస్పీ కాలువకు తూము ఏర్పాటు చేయాలి**

డిబిఎం 38 ఎస్సారెస్పీ కాల్వ ద్వారా మండలంలోని సూర్యనాయక్ తండ, గంగిరేనిగూడెం, వసంతపూర్ గ్రామాల్లోని చెరువులకు నీరు అందుతుందని, తూము లేకపోవడంతో ఎస్సారెస్పీ కాలువ నీరు అందడం లేదు. గాంధీనగర్ వద్ద ఎస్ఆర్ఎస్పీ కాల్వకు తూము ఏర్పాటు చేసినట్లయితే మూడు గ్రామాల చెరువులకు నీరు సమద్ధిగా చేరుతుందని రైతులు తెలిపారు.

**ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి : ముక్కెర విజయ్**



తనకున్న ఎకరం భూమితోపాటు మరో మూడు ఎకరాల భూమిని ఎకరాకు రూ.15 వేల చొప్పున కౌలుకు తీసుకొని వరిపంట సాగుచేశా. వంట ఏపుగా ఎదిగి గొలుసులు వేసి పాల దశకు చేరుకుంది. చెరువులో నీటిమట్టం అడుగంటి పోవడంతో సాగునీరు లేక పంటలు ఎండిపోయాయి. సాగునీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.50 వేలు ప్రభుత్వం పరిహారం అందించి రైతాంగాన్నిఆదుకోవాలి.నష్టంపై రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో విచారణ చేపట్టాలి.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఎన్నికల పరిశీలకులు దిలీబన్

**నవతెలంగాణ-శాయంపేట**



ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిళ్ల కు గురవుతున్నారని,ఆధ్యాత్మి కతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఐఆర్ఎస్ ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ ఎలక్షన్ అబ్జర్వర్ దిలీబన్ అన్నారు. మండలంలోని పెద్దకోడపాక గ్రామంలోని కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని శుక్రవారం ఆయన సందర్శించగా ఆలయ అర్చకులు అనుదీప్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పంచామృత అభిషేకాలను నిర్వహించారు. పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించి ఆలయ విశిష్టతను వివరించారు. ఆయన వెంట తహశీల్దార్‌లు సుభాషిని, వెంకటభాస్కర్, ఎంఆర్ఐ శరత్ కుమార్, రాకేష్, జాగృతి యువ నాయకులు అమ్మ అశోక్ పాల్గొన్నారు.

## ఎండతీవ్రతను తట్టుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి

**నవతెలంగాణ-శాయంపేట**



ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని కార్మికులం దరూ ఎండ తీవ్రతను తట్టుకోవడానికి జాగ్రత్తలు పాటిస్తూ పనులు ముగించుకొని ఉదయం 11 గంటలలోపు ఇంటికి చేరుకో వాలని ప్రజ్వల్ సంస్థ ఫీల్డ్ ఫెసిలిటర్లు కుక్కల కల్పన, తరాల తిరుపతి అన్నారు. మండలంలోని గోవిందాపూర్, నేరేడుపల్లి, నూర్జహాన్ పల్లి, గొల్లపల్లి గ్రామాలలో శుక్రవారం హెచ్ అండ్ఎం ఆర్థిక సహకారంతో ప్రజ్వల్ రైతుల ఉత్పత్తిదారుల సంఘం క్షేత్ర కార్యకర్తలు కల్పన, తిరుపతి కార్మికులకు ఎండ తీవ్రత పై అవగాహన కల్పించారు.అనంతరం కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చెరువు మట్టి ప్రాముఖ్యతను వివరించి పంట భూములలో నల్లమట్టి వేసుకునేలా ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రశేఖర్, దుగ్యాల రాణి, క్షేత్ర సిబ్బంది ఎస్.కె గౌస్, పోతు సునీల్, భానుమతి, ప్రశాంత్, రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

# మనువాదాన్ని ఓడిద్దాం... రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

**నవతెలంగాణ-హన్మకొండ**



మనిషిని మనిషిగా చూడ నిరాకరించిన మనువాదాన్ని ఒడించి ప్రజలందరికిస్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందిస్తున్న భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. డీబీఎఫ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సంయుక్తంగా నిర్వహించిన భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్‌లో జరిగింది. ఈ సదస్సుకు డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, ఎఐఎవైయస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల సందిప్ అధ్యక్షత నిర్వహించగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న పి.శంకర్ మాట్లాడుతూ మహనీయులైన పూలే,అంబేద్కర్, జగ్ జీవన్ రామ్ ల జయంతుల మహోత్సవం సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణకై అందరూ కంకణబద్దులు కావాలన్నారు. విసికే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, ఆస్తులు, సంపదలను రాజకీయ అధికారాన్ని అణగారిన వర్గాలకు మనువాదం దూరం చేసిందన్నారు. మానవ హక్కులను అందించిన రాజ్యాంగాన్ని 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని పదేపదే ప్రకటిస్తున్న కేంద్ర మంత్రుల కుట్రలను అర్థం చేసుకొని రానున్న పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించుకొవాలన్నారు. దళిత వాడల్లోకి వస్తున్న మనువాధాన్ని తరిమికొట్టి అంబేద్కర్ వాదాన్ని, రాజ్యాంగాన్ని ముందుకు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మన్నే బాబురావ్, కొండ్ర నర్సింగరావు, పులి కల్పన, సోమ రాంమూర్తి, జన్ను నర్సయ్య, సింగారపు రవి ప్రసాద్, బుంగ జ్యోతి రమణ, కేడల ప్రసాద్, ఐతం నగేష్, మచ్చ దేవేందర్, రమేష్, బొర్ర సంపూర్ణ, కొమ్ముల కరుణాకర్, మేకల అనిత, ఎడ్ల అర్జున్, కన్నాల రవికుమార్, నర్సింగరావు, జక్కుల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనాల కోసమే పరిశోధనల ఫలితాలు

- కేయూ వైస్ ఛాన్సలర్ తాటికొండ రమేష్

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**



కాకతీయవిశ్వవిద్యాలయ కామర్స్ కళాశాల ఆధ్వర్యం లో కళాశాల సెమినార్ హాల్ లో ప్రిన్సిపాల్ ఆచార్య పి. అమరావేణి అధ్యక్షతన నిర్వహించిన వారం రోజుల పరిశోధనల పై పరిశోధకులకు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ టీ.రమేష్ హాజరై పరిశోధకులు, బోధనా సిబ్బంది తో మాట్లాడారు. మారుతున్న పరిస్థితులు, పరిశోధనల్లో వస్తున్నా మార్పులు, కృత్రిమమేథ నైపథ్యంలో పరిశోధకుని ఫలితాలపై చాలా ప్రభావం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో దత్తాంశం సేకరించినప్పుడే ఉత్తమ పరిశోధన ఫలితాలు వస్తాయన్నార. సెకండరీ డేటా కుడా సరిగా వినియోగించటంలో ఇంటర్ప్రిట్ చేయటం లో పరిశోధకుని ప్రతిభ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

చాట్ జీపీటి, కృత్రిమా మేథా ద్వారా పరిశోధనల ఫలితాలు, గత పరిశోధనల అంశాలు, మన అరచేతి లో లభ్యం అవుతున్నప్పటికీ సజనకు మించినది లేదు అని పరిశోధకుడు గుర్తించాలి, తన ఆలోచన, సృజనను అవలంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య పి.వరలక్ష్మి, పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడు ఆచార్య రాజేందర్‌కట్ల, పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహాచారి, విశ్రాంత విభాగ ఆచార్యులు ఆచార్య పి.కృష్ణమాచారి, ఆచార్య ఓంప్రకాష్, ఆచార్య జి.వి.భవాని ప్రసాద్ తదితరలు పాల్గొన్నారు.



# కుటిల రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ ఎమ్మెల్యే కడియం



- దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలని సవాల్
- మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, తాటికొండ రాజయ్య

**నవతెలంగాణ-హన్మకొండ**

కుట్రలు కుటిల రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ కడియం శ్రీహరి అని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యలు అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కుడా మాజీ చైర్మన్ మర్రియాదవ రెడ్డి అధ్యక్షత న నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, దాస్యం వినయ్‌భాస్కర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీ.రాజయ్య మాట్లాడుతూ కేసీఆర్ బీఆర్ఎస్ తరపున బరిలో నిలిపిన సుధీర్ కుమార్‌ను అందరం కలిసి గెలిపించాలని కోరారు. ప్రస్తుతం తెలంగాణ మొత్తం వరంగల్ వైపు చూస్తోందని కడియం శ్రీహరిని స్టేషన్ ఘన్‌పూర్ చెరువులు, రిజర్వాయర్ల బుడుగుల్లో తొక్కుదామని అన్నారు. కడియం శ్రీహరి ఇటు దళితులు, అటు పద్మశాలి, బైండ్ల జాతి ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నాడని అన్నారు. ఆయన టీడీపీ హయాంలోనే లంచాలు తీసుకుండు... ఇప్పుడు నేను సత్య హరిశ్చంద్రుడిని అంటున్నాడని నిజానికి కడియం శ్రీహరి దళితద్రోహి, దళితదొర అని ఎద్దేవా చేశారు. నేను రోషం ఉన్నవాడిని, తొడగొట్టి, మీసం తిప్పి సవాలు చేస్తున్న... దమ్ముంటే రాజీనామా చేసి ఎన్నికల్లో నిలబడు... నా పని అంతా కడియం శ్రీహరిని రాజకీయంగా సమాధి చేయడమే అని సవాల్ చేశారు. మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్య మం, 10 ఏండ్ల పాలన చెబుతూ ఎన్నికల్లోకి వెళ్తామని బరాబర్ పార్టీకి ద్రోహం చేసిన వారిని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని పార్టీ కార్యకర్తలు, ప్రజలే ద్రోహుల సంగతి చెపుతారని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి , జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ నేను పార్టీ కార్యకర్తనేనని కేసీఆర్ గారికి వెంట 2001 నుంచి నడుస్తున్నానని ప్రస్తుతం జరుగుతున్న కడియం కావ్య నాన్ లోకల్ అనే అంశం జోలికిపోను కానీ, నేను పక్కా లోకల్ , మాదిగ సామాజిక వర్గ బిడ్డను, ఉద్యమకారుడిని, పశ్చిమ బిడ్డను, విద్య ఇక్కడే, గల్లీగల్లీ తెలిసిన వా డిని నాకు పోటీ కడియం కావ్య కాదు, నేను జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తా ను. కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి... ఇద్దరం బరిలో ని లుద్దామని సవాల్ చేశారు. చాలాకాలంగా వరంగల్ ప్రజలు భిన్నమైన తీర్పు ఇస్తున్నారని పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ కోసం కొట్లాడిన బీఆర్ఎస్, ఉద్యమ పార్టీనే గెలిపించుకుందామన్నారు. యువత ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జనగామ
శనివారం | ఏప్రిల్ 20, 2024 | www.navatelangana.com

## నామినేషన్‌కు తరలిన సీపీఎం శ్రేణులు

నవతెలంగాణ-బచ్చన్నపేట



సీపీఎం పార్టీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి కామ్రేడు ఎండి జహంగీర్ నామినేషన్ వేయడానికి భువనగిరికి తరలి వెళ్లారు. ఈ క్రమంలో బచ్చన్నపేట మండలం ప్రజలు, నాయకులు సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మండల అకౌంట్ సభ్యులు అశోక్, ఎడబోయిన రవీందర్ రెడ్డి, బైరగోని బలరాములు, తాడూరి వెంకటమ్మ, తాడెం రాములు, పొన్నాల రాజవ్వ, చొక్కా సులోచన, బోడపట్ల బాలరాజు, జేరిపోతుల రవీందర్, బోదాసు సుధాకర్, పర్వతం నరసింహులు, గోలకొండ ఈదమ్మ, భాశెట్టి శోభ, బొట్టు కమలమ్మ, భావనపల్లి సంపూర్ణ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దేవరుప్పుల



మండల కేంద్రంలోని కొత్తవాడలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మానిడాల యశస్వినీ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మద్దతు ధరలకు విక్రయించాలని, దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు అమ్ముకోవద్దని సూచించారు.అలాగే వారం రోజుల నుండి ఎండలు ఎక్కువగా ఉన్నాయి కావున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని అప్పుడప్పుడు తీసుకోవాలని రైతులకు సూచించారు.



## కారు ఖాళీ... కాంగ్రెస్ జోరు...

నవతెలంగాణ-కొడకండ్ల

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడంతో మండలంలో కారు పార్టీ ఖాళీ అయిపోయింది. పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి సమక్షంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లతో సహా 300 మంది బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు ఝాన్సీ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కొడకండ్ల మాజీ సర్పంచ్ మధుసూదన్ నర్సింగాపురం మాజీ సర్పంచ్ దండంపెల్లి శ్రీలత అఖ్యాతాండ, మాజీ సర్పంచ్ గుగులోతు రాజ్యా నాయక్, కొడకండ్ల ఎంపీటీసీ-1 కుందూరు విజయలక్ష్మి అమరేందర్ రెడ్డి, రేగుల ఎంపిటిసి దౌపతి లక్ష్మి, లక్ష్మక్కపెల్లి ఎంపిటిసి రామకోటితో పాటు మాజీ సర్పంచులు యూత్ కమిటీ అధ్యక్షులు, యూత్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

## లోకసభ ఎన్నికల్లో సత్తా చాటాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

నవతెలంగాణ-కొడకండ్ల

లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటి కాంగ్రెస్‌కి తగిన గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్న నేటికీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా అమలు చేయలేదని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు అయ్యేదాకా ప్రభుత్వంపై పోరాడి ప్రజల పక్షాన కొట్లాడాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించడంతో పాటు పాలకుర్తి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీని సాధించాలని సూచించారు. పార్టీకి నమ్మకద్రోహం చేసి పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహులను ప్రజలు నమ్మొద్దని, పార్టీలో అన్ని రకాలుగా అనుభవించి రాజకీయంగా ఆర్థికంగా లబ్ధి పొంది పార్టీలో సముచిత స్థానం కల్పించిన పార్టీ వీడిన నాయకులను ఏమనాలో వాళ్లే తెలుసుకోవాలన్నారు. అన్ని రకాలుగా గ్రామాలలో ప్రజలను బెదిరింపులకు గురి చేయడమే కాకుండా ఇసుక మాఫియా, భూమాఫియా అనేక విధాలుగా పార్టీని పీడించి పార్టీని వీడి మరొక పార్టీలో చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రామోజీ, బీఆర్ఎస్‌కి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి నామినేషన్

- భారీగా తరలి వెళ్లిన జనగామ సీపీఎం శ్రేణులు

నవతెలంగాణ-జనగామ



భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి యండి జహంగీర్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం భువనగిరి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించు రోడ్డు షో, బహిరంగ సభకు జనగామ నియోజకవర్గం మండలాల నుండి గ్రామ, గ్రామం నుంచి సీపీఎం శ్రేణులు, పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, శ్రేయోభిలాషులు, వామపక్ష ప్రజాతంత్రవాదులు, అన్ని వర్గాల ప్రజలు, మహిళలు భువనగిరి పట్టణానికి వందలాదిగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పార్టీ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం మోకు కనకారెడ్డి మాట్లాడుతూ పేదల పెన్నిధి, పోరాటల వారధి నిరంతరం ప్రజా సమస్యల వైపు, ప్రజల హక్కుల కోసం నిలబడి పోరాడే భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సిపిఐ (ఎం) పార్టీ అభ్యర్థి యండి జహంగీర్ గారిని గెలిపించాలని మోకు కనకారెడ్డి కోరారు.తెలంగాణ రైతాంగ పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న సిపిఐ (ఎం) పార్టీ దేశ రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నదన్నారు. పేదలు, కష్టజీవుల తరపున నీతితో, నిజాయితీతో పోరాడుతున్న సిపిఐ (ఎం) పార్టీ అభ్యర్థి యండి. జహంగీర్ గెలుపు నీతి, నిజాయితీ, నిస్వార్థత, నిబద్ధతతో కూడిన గెలుపు కమ్యూనిస్టుల గెలుపు ప్రజా పోరాటాల గెలుపు అని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, దేశ సమగ్రాభివృద్ధి, ప్రజాస్వామ్య హక్కులు, లౌకిక విలువలు, రాజ్యాంగం పునాదుల పరిరక్షణ కోసం, దేశ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టుల అవసరం ప్రస్తుత పరిస్థితులలో ఎంతైనా ఉందని, అందుకే సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి సిపిఐ(ఎం) పార్టీ అభ్యర్థి యండి. జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ రంగం రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాష్, సుంచు విజేందర్, బోడ నరేందర్, బెల్లంకొండ వెంకటేష్, పోత్కనూరి ఉపేందర్, బాల్నే వెంకటమల్లయ్య, టి. దేవదానం, కె. లింగం పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది

- జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును ఉపయోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం పెంబర్తి గ్రామంలోని ఉపాధి హామీ కూలీలతో లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు లిస్టులో వారి పేరు నమోదును చెక్ చేసుకోవాలని, మే 13న అందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీగా ఓటును బాధ్యతాయుతంగా వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పల్లా సుందర్ రాంరెడ్డి

నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని మాధాపురం గ్రామానికి చెందిన లకావత్ సుగుణ-దేవ్లా దంపతుల కుమారుడు ప్రదీప్ కుమార్-స్వప్న కుమారిల వివాహం హైద్రాబాద్‌లోని శ్రీ దుర్గ కాన్వెంక్షన్ హాల్‌లో శుక్రవారం జరుగగా ఆ వివాహానికి హాజరై నూతన వధూవరులను బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ఆశీర్వందించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడిలో ప్రీ ప్రైమరీ అన్యువల్ సెలబ్రేషన్స్

నవతెలంగాణ-తరిగొప్పుల



మండల పరిధిలోని అబ్దుల్ నాగారం గ్రామంలో గల అంగన్వాడి ఒకటి, రెండవ కేంద్రాలలో ప్రీ ప్రైమరీ అన్యువల్ డే సెలబ్రేషన్స్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ వసంత పాల్గొని మాట్లాడారు. స్కూల్ లాస్ట్ రోజులో సంవత్సరం మొత్తం నిర్వహించినవి పిల్లలతో చేయించి తల్లులకు చూపించడం జరిగింది. అన్యువల్ డేలో పిల్లలతో డాన్సులు ఆకట్టుకున్నాయి. మూడు నెలలకు ఒకసారి అసెస్మెంట్ పిల్లలకు స్టార్స్ గుర్తించి వారికి ప్రోగ్రెస్ ఇవ్వడం జరుగుతుంది. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రేణుక, మంజుల, ఆయాలు సుజాత, బాలమణి, బాలింతలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సందెల అశోక్ మృతి

నవతెలంగాణ-బచ్చన్నపేట



సిద్దిపేట జిల్లా దుద్దెడ క్రాసింగ్ టూల్ గేట్ వద్ద బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన సందెల అశోక్ (65) మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల పోలీసుల వివరాల ప్రకారం అశోక్ శుక్రవారం బచ్చన్నపేట ఇంటి నుండి తన ఆరోగ్య నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి వెళుతుండగా దుద్దెడ క్రాసింగ్ వద్ద అటుగా వస్తున్న ఆటో డ్రైవరు అతివేగంతో ఆటో నడుపుతూ, అశోక్ వెళ్తున్నటువంటి మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టడంతో అశోక్ తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతునికి ముగ్గురు కుమారులు భార్య ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా హాస్పిటల్ తరలించినట్లు తెలిపారు. అశోక్ కుమారుడు సందెల లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## పకడ్బందీగా ఈవీఎం, వీవీ ప్యాట్‌ల తరలింపు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా ఈవీఎం,వీవీ ప్యాట్‌లను తరలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గోదాం నుంచి మూడు నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచేందుకు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల తరలింపు ప్రక్రియను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారి 100-పాలకుర్తి అండ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, సహాయ రిటర్నింగ్ అధికారి 098-జనగామ ఆర్డీవో డి.కొమురయ్య, సహాయ రిటర్నింగ్ అధికారి 099-ఘనపూర్(స్టేషన్) ఆర్డీవో డిఎస్.వెంకన్నలతో కలిసికలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు బ్యాలెట్ యూనిట్స్ (1085), కంట్రోల్ యూనిట్స్ (1085), వీవీ ప్యాట్స్ (1216)లను మూడు నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూంలకు తరలించాలన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల వివరాల స్కానింగ్‌ను పకడ్బందీగా నిర్వహించి, ధృవీకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి చెంచారపు శ్రీనివాసరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి రావెల రవి, బిజెపి పార్టీ ప్రతినిధి విజయభాస్కర్, సీపీఎం పార్టీ ప్రతినిధి జోగు ప్రకాశ్, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలను భద్రపరచిన అధికారులు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈవీఎంలను భద్రపర్చినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి డీఎస్ వెంకన్న తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగడానికి కింది స్థాయి అధికారులు బాధ్యతా యుతంగా పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అర్జున్, ఎస్సై వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ మున్సిపాలిటీ 4వ వార్డ్ కౌన్సిలర్ మంత్రి సుమలత శ్రీశైలం శుక్రవారం డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ కౌన్సిలర్ అరుట్ల లోకమంతా రెడ్డి, గుజ్జుల తుకారాంలతోపాటు తొట్టె నర్సింగ్ యాదవ్ తదితరులు కూడా డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పటిష్టతకు తమ వంతు కృషి చేస్తామని చేరిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మ గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి యండి జహంగీర్ నామినేషన్ సందర్భంగా చేపట్టిన ప్రజా ప్రదర్శన ర్యాలీ, బహిరంగ సభ దృశ్యాలు**


































## ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో సమీక్ష

నవతెలంగాణ-దంతాలపల్లి



ఉపాధి హామీ పనుల పనితీరుపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వివేక్రం మాట్లాడుతూ కూలీల లక్ష్యాలు చేరుకోవాలని, వేసవి దృష్ట్యా ఉదయం సమయంలోనే పనులు చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. పని ప్రదేశంలో జనాభాకు తగ్గట్లు టెంట్లు, మంచినీటి సౌకర్యం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూలీలకు ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వివేక్రమ్ తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు విజయ్, సుజన, ఫీల్డ్ అసిస్టెంట్లు రంజిత్, వెంకన్న, విజయ పాల్గొన్నారు.

## మానుకోట డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ పట్టణంలోని డంపింగ్ యార్డ్‌లో చెత్తను శుద్ధి చేయుటకు బయోమైనింగ్ యంత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో గల మున్సిపల్ డంపింగ్ యార్డును సందర్శించి మాట్లాడారు. బయో మైనింగ్ విధానం ద్వారా వ్యర్థాలను తొలగించి చెత్తను శుద్ధిచేయుటకు యంత్రాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. యంత్రాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, స్థానిక కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి శంకర్, మార్నేని రఘు, అంబాల శివకుమార్ పాల్గొన్నారు.



## కార్మిక ద్రోహానికి పాల్పడినందునే రాంసింగ్ బహిష్కరణ

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ

నవతెలంగాణ-బయ్యారం

గత 40 ఏళ్ల క్రితం ఇల్లందు నుండి మహబూబాబాద్ వరకు ఉన్న పెంకు పరిశ్రమలలో ఎంతో కష్టపడి అమరుడు ముక్తార్ పాష యూనియన్ ఏర్పాటు చేశాడని దీనిని విప్లవ కార్మిక సంఘంగా నిలిపి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టాడని ఆయన వెంట తిరిగి తులసి వనంలో గంజాయి మొక్కల రాంసింగ్ మారి కార్మికులకు తీరని ద్రోహం చేశాడని, వ్యక్తిగత పని పద్ధతి స్వార్థం, కార్మిక హక్కుల తాకట్టుపెట్టి, యూనియన్ నిధులను స్వాహా చేయడం, పెంకు కార్మికులకు నష్టం చేసేందుకు పాల్పడినందుననే తెలంగాణ టైల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతల నుండి ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ నుండి బానోతు రాంసింగ్‌ను, ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుండి ఆరెళ్లి కృష్ణను బహిష్కరించినట్లు భారత కార్మిక సంఘాల సమాఖ్య తెలంగాణ అధ్యక్షురాలు జి.అనురాధ తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని పెంకు ఫ్యాక్టరీలలో కార్మికులతో ఆమె జనరల్ బాడీని నిర్వహించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ కార్మిక ప్రయోజనాలకు నష్టం చేసే వారు ఎంత స్థాయిలో ఉన్న ఐఎఫ్టియు క్షమించదని ఆమె స్పష్టం చేశారు. కార్మికులకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించి ఆయనను సరి చేసేందుకు గట్టిగా ప్రయత్నించటంతో ఆయనను సంస్థ నుండి బహిష్కరిస్తున్నట్లు అనురాధ తెలిపారు. యాజమాన్య తొత్తుగా కార్మిక ద్రోహిగా మారిన రాంసింగ్ కుటీల ప్రయత్నాలను తిరస్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ రెండు జిల్లాల్లో పెంకు పరిశ్రమలలో జరిగిన జనరల్ బాడీ కార్యక్రమానికి తెలంగాణ టైల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జే.సీతారామయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎండి.రాసుద్దీన్, శివారపు శ్రీధర్, ఐఎఫ్టియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఎల్.విశ్వనాథం, బయ్యారం ఏరియా ఐఎఫ్‌టియు కార్యదర్శి మాదంశెట్టి నాగేశ్వర రావు, తెలంగాణ టైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శంకర్, అధినారాయణ, కోటయ్య, వైబాగుల శ్రీను, పాష, రాజు, సాంబ, లక్ష్మయ్య, రాంబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.400 ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు గునిగంటి మోహన్

నవతెలంగాణ-చిన్న గూడూరు

ఉపాధి హామీ కార్మికులు కనీస వేతనాలు రోజుకు రూ.400 ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకుడు గునిగంటి మోహన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజులకు పని దినాలు పెంచి రోజుకు రూ.400 రూపాయలు కనీస వేతనాలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.200 కూడా వేతనం ఇవ్వడం లేదని అన్నారు. కొన్నేళ్ళ సిపిఎం చేస్తున్న పోరాటం ఫలితంగా వేతనాలు క్రమంగా పెరుగుతుందని మళ్లీ ఆందోళన చేయడం ద్వారా వేతనం రూ.400 వరకు పెంచుకోవాలని అన్నారు. కూలీలంతా సంఘటితంగా ఉండి ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీ ద్వారా సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవచ్చని సూచించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి పోరాటం చేయక తప్పదన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపికి కూలీల సమస్యలు పట్టడం లేదన్నారు.

## ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-గూడూరు

యూనియన్ బ్యాంక్ గూడూరు శాఖ ఆధ్వర్యంలో రెండు లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మేనేజర్ భన్సిలాల్ శుక్రవారం అందజేశారు. గూడూరు యూనియన్ బ్యాంక్ శాఖలో మచ్చర్ల గ్రామానికి చెందిన వట్టం వెంకన్న అనే ఖాతాదారుడు ఇటీవలే సహజ మరణం చెందారు. మేనేజర్ మాట్లాడుతూ అర్హత కలిగి ఉన్న ప్రతి ఖాతాదారుడు కేంద్ర ప్రభుత్వ జీవనజ్యోతి బీమా యోజన సురక్ష బీమా యోజన పథకాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈపథకం నమోదు చేసుకున్నటువంటి ఖాతాదారులు సహజ మరణం అయినా ప్రమాదవశాత్తూ అయినా నామినీ బీమా నగదును పొందవచ్చును.అన్నారు. సహజ మరణం చెందిన వట్టం వెంకన్న భార్య వట్టం సత్యమ్మకు రెండు లక్షల భీమా నగదును బ్యాంకు మేనేజర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో సబ్ మేనేజర్ మనోజ్ కుమార్, బిజినెస్ కరస్పాండెంట్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## గ్రీన్‌నెట్ పందిళ్లు ఏర్పాటు

నవతెలంగాణ-దంతాలపల్లి



మండలంలోని కుమ్మరి కుంట్ల గ్రామంలో మండే ఎండలో ఉపాధి హామీ పనులు అనే శీర్షిక 'నవతెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి సుజన ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో గ్రీన్ నెట్టు తాత్కాలిక పందిళ్లను నిర్మించారు. త్రాగునీటి సౌకర్యం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుతామని 'నవ తెలంగాణ' దినపత్రిక ప్రతినిధికి తెలిపారు. ఈ విషయాలను ఎంపీడీవో వివేక్రం నవతెలంగాణ ప్రతినిధి మాట్లాడడంతో పని ప్రదేశంలో మౌలిక సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని, పనిచేయని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఘనంగా గౌస్ 3వ వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-కేసముద్రం రూరల్



కేసముద్రం మండలం జ్యోతి రావు పూలే సెంటర్లో ఎంసిపిఐయు పార్టీ ఆల్ ఇండియా కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ మమ్మద్ గౌస్ 3వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంసిపిఐయు పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కంచ వెంకన్న మాట్లాడుతూ మహ్మద్ గౌస్ మద్ది కాయల ఓంకార్‌కు అత్యంత సన్నిహితుడని, అనేక భూ పోరాటాలు అనేక ప్రజా ఉద్యమాలు నడిపే నవాడని, నక్సలైట్ల ఆగడాలకు సైతం ఎదురోడ్డి పోరాడిన వాడు అని అదేవిధంగా కమ్యూనిస్టు పార్టీలతో సమస్యల వారిగా అంశాల వారిగా కలిసి ఐక్య ఉద్యమాలు చేసేవాడని ఆయన అన్నారు. కరోనా వ్యాధికి గురై మరణించడం జరిగిందని ఆయన తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ఎంసిపిఐయు పార్టీ కార్యకర్తలు ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జాటోత్ బిచ్చ నాయక్, ఏఐసీటియు కార్మిక సంఘం నుండి ధారావత్ వీరు నాయక్, కీర్తి, సూరయ్య, జిలకర లక్ష్మయ్య, నాగన్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కంచుకోట మానుకోట

- బీఆర్‌ఎస్, బీజేపీలకు ఓట్లు అడిగే నైతిక హక్కులేదు
- బలరాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి
- మహబూబాబాద్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-ప్రాంతీయ ప్రతినిధి వరంగల్

మహబూబాబాద్ ఎప్పటికి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటేనని టీపీసీసీ అధ్యక్షులు, సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జనజాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పార్లమెంట్‌లో తెలంగాణ ఏర్పాటును ప్రధాని నరేంద్రమోడీ తప్పు పట్టారని తల్లి నుంచి బిడ్డను వేరు చేసినట్లుగా మాట్లాడిన మోడీకి తెలంగాణలో ప్రజలు ఎలా ఓట్లు వేస్తారని నరేంద్రమోడీని, కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఢిల్లీలో ఉండే మోడీ ఇక్కడ ఫాం హౌస్‌లో ఉండే కేడీ ఇద్దరు తోడు దొంగలేనని అన్నారు. వీరిద్దరు ఈ ఎన్నికల్లో చీకటి ఒప్పందం చేసుకున్నారని అందులో భాగంగానే మహబూబ్‌నగర్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల, జహిరాబాద్, బోనగిరి పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం బీఆర్‌ఎస్ బలహీనమైన అభ్యర్థులను బరిలోకి దించిందన్నారు. బిడ్డ బెయిల్ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని పదేండ్లలో పార్లమెంటులో రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నల్ల చట్టాలను జమ్ము, కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తివేత వీటన్నింటికి బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతు పలికారన్నారు. అలాంటి కవిత ఇక్కడ ఓటు ఎలా అడుగుతుందని ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చే కమిషన్‌లకు మోడీ కక్కుర్తి పడ్డాడని అందుకే కాళేశ్వరంలో జరిగిన అంత అవినీతిపై కేసు పెట్టి జైలుకు పంపలేకపోయారన్నారు. ఈ పదేండ్లలో పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులు జాతీయ హెూదా ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని మూసి వేసింది ఈ బీజేపీ నేతలు కారణం కాదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీ కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మంజూరి చేస్తే నరేంద్ర మోడీ ఆ ఫ్యాక్టరీని నిలిపి వేసి కోచ్ ఫ్యాక్టరీ అప్పుడు అవసరం లేదని చెప్పి లాహెూర్‌కు తరలించారని అన్నారు. సోనియా గాంధీ గిరిజన యూనివర్సిటీని మంజూరి చేస్తే ఈ పదేళ్లలో ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కూలగొట్టి, పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులను ఎండబెట్టి తెలంగాణ ప్రాంతానిక తీరని అన్యాయం చేశారని అన్నారు. నరేంద్రమోడీ, కిషన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను తప్పు పట్టినవారని, తెలంగాణ ద్రోహులను వీరికి తెలంగాణలో ఓటు అడిగే హక్కులేదని అన్నారు. ఉత్తరాదిలో కుంభమేళకు వేల కోట్ల ఖర్చు చేసిన కేంద్రం కోట్లాది మంది ఆదివాసీలు జరుపుకునే మేడారంకు ముష్టి మూడు కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు ఖర్చు చేసిందన్నారు. మేడారం జాతరకు జాతీయ హెూదా కల్పించని బీజేపీకి ఎందుకు ఓటు వేయాలని నిలదీసారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలో ఐదింటిని అమలు చేసినా కేడీ అవాకులు చేవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. హామీలు అమలు చేయని రేవంత్‌రెడ్డి దిగిపోవాలని ప్రచారం చేస్తున్నారని అన్నారు. మేము అధికారం నుంచి దిగిపోవడానికి అల్లాటప్పాగా రాలేదని వారిని తొక్కుంటు అధికారంలోకి వచ్చామన్నారు. నీ అయ్య దిగివచ్చినా హామీలన్ని నెరవేర్చి ప్రజా పాలన అందిస్తామన్నారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చెల్లిస్తామని హామీనిచ్చారు. రైతులు పండించే పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. నరేంద్రమోడీ గ్యాస్‌ను రూ.12వందలు ధర పెంచితే కాంగ్రెస్ పార్టీ రూ.500కే గ్యాస్ అందిస్తుందన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని మూడు నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

### 120 రోజుల్లోనే సంక్షేమ ఫలాలు : మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 120 రోజుల్లోనే సంక్షేమ ఫలాలను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని వ్యవసాయ శాఖ మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సీఎం సమర్థత, దూరదృష్టి వల్లే ఆరు గ్యారెంటీలలో ఐదు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేసామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల్లో, ఆరు నెలలల్లో పడిపోతుందని గూటికాడి నక్కలా కేసీఆర్ ఎదిరి చూస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బలపడాలంటే రాష్ట్రంలోని 15 పార్లమెంట్ సీట్లను గెలిపించుకోవాలన్నారు. మన పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ సామాన్యుడని, అందరికి అందుబాటులో ఉండే వ్యక్తి అని బలరాం నాయక్‌ను బారీ మెజారిటీతో గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని ఓటర్లను కోరారు.

### బీజేపీకి ఆ నాలుగు సీట్లు కూడా దక్కవు : మంత్రి పొంగులేటి

బీజేపీ పార్టీ గతంలో గెలుచుకున్న ఆ నాలుగు సీట్లు కూడా ఇప్పుడు దక్కవని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు రూ.10 లక్షల కోట్ల ఇచ్చినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెబుతున్నారని అదే తెలంగాణ నుంచి ఎన్ని వేల కోట్లను పన్నుల రూపంలో తీసుకుందని చెప్పడం లేదని అన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు కేటాయించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని ఎందుకు కేటాయించలేదో చెప్పాలని నిలదీశారు. బలరాంనాయక్‌ను బారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

### రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్న బీజేపీ : మంత్రి సీతక్క

బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే భారతరాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర పన్నిందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయసీతక్క అన్నారు. బలరాంనాయక్‌ను బారీ మెజారిటీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలన్నారు. కాంగ్రెస్ వల్లే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు వచ్చాయని, గిరిజనులకు ఐటీడీఏలను ఏర్పాటు చేశారన్నారు. ఆదివాసీలు, బంజారాలు ఒక్కటై మూకుమ్మడిగా బలరానాయక్‌ను గెలిపించాలన్నారు. ఈ సభలో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు యశస్విని‌రెడ్డి, కనకయ్య, బెల్లం వెంకట్రావ్, పాయం వెంకటేశ్వర్లు, పీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోడెం వీరయ్య, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌చౌదరి, రాష్ట్ర గ్రంథాయల సంస్థ చైర్మెన్ మహ్మద్ రియాజ్, మాజీ ఎంపీ రవిందర్‌నాయక్, బెల్లయ్యనాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి పాల్గొన్నారు.

**మరిపెడ :** బీజేపీ నరేంద్ర మోడీ, బీఆర్‌ఎస్ కేసీఆర్ ఇద్దరు తోడుదొంగలే అని, పైకి వ్యతిరేకంగా ఉన్నా లోలోపల చీకటి ఒప్పందాలు చేసుకుంటారని, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్ అన్నారు. దేశంలో అధికారంలోకి వచ్చి పదేళ్లు అవుతున్నా నరేంద్ర మోదీ ఏ ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదన్నారు. తెలంగాణలో పదేళ్లు పాలించిన కేసీఆర్ కూడా పేదోడికి మొండి చేయి చూపించారన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్న మోదీ ప్రభుత్వానికి చెక్ పెట్టాలని అన్నారు. మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ మాట్లాడుతూ దేశంలో సుపరిపాలన రావాలన్నా, పేదల ప్రభుత్వం ఏర్పడాలన్నా కాంగ్రెస్ పార్టీతో కలిసి బరిలో నిలుస్తున్న ఇండియా కుటమిని బలపర్చాలని, లౌకిక ప్రజాస్వామిక శక్తులను గెలిపించాలని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా ఉక్కు కర్మాగారాన్ని నిర్మిస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం నేడు బయ్యారం ఉక్కుకర్మాగారన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావు మాట్లాడుతూ ఈ పదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ కూడా భద్రాచలం అభివృద్ధిని విస్మరించిందన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు గడవక ముందే ప్రజలకు ఐదు గ్యారంటీలు అందించిందని, ఎన్నికల కోడ్ రాకుంటే పేదల ఇంటి కల కూడా పట్టాలు ఎక్కేదని అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో మత విద్వేశాలను రెచ్చగొడుతూ రాముడి పేరుతో బీజేపీ రాజకీయాన్ని రగిలిస్తుందని, ప్రజలు దీనిని గమనించి భవిష్యత్ తరాల బాగు కోసం ప్రజాస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వాలన్నారు.

### అట్టహాసంగా బలరాం నాయక్ నామినేషన్

**మహబూబాబాద్ :** రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్లో బలరాం నాయక్ తన కుటుంబ సభ్యులతో పాటు మంత్రి సీతక్క, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళి నాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, పీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డితో కలిసి నామినేషన్ పత్రాలు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు అందజేశారు. మహబూబాబాద్ పట్టణంలోని శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడారు. తన నామినేషన్‌లో నియోజకవర్గ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారని, తనకు సహకరించారని తెలిపారు.

### కాంగ్రెస్‌లోకి జెడ్పీటీసీ బండి వెంకట్ రెడ్డి

మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ముఖ్య అనుచరుడు కొరివి మండల జెడ్పిటిసి సభ్యులు బండి వెంకటరెడ్డి కాంగ్రెస్‌లోచేరారు.శుక్రవారం మానుకోటలో డిసిసి అధ్యక్షుడు జన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి డోర్నకల్ ఎమ్మెల్యే తేజావత్ రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గత 35 సంవత్సరాలుగా డోర్నకల్ నియోజకవర్గం, కురవి మండలంలో ప్రజాప్రతినిధిగా, పార్టీ నాయకునిగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు సేవలందిస్తు వస్తున్నారు. టీడీపీలో మండలాధ్యక్షులుగా14సంవత్సరాల పని చేసి గుండ్రాతి మడుగు సర్పంచ్‌గా, టీఆర్‌ఎస్‌లో కురవి మండల జడ్పీటీసీగా ప్రజలకు అందుబాటులో ఉన్నారు. రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్‌కు నమ్మకస్తునిగా కురవి మండలం, డోర్నకల్ నియోజకవర్గం, మహబూబాబాద్ జిల్లా ప్రజలకు సుపరిచితులు. బండి వెంకట్ రెడ్డి మంచితనం ప్రజలపట్ల నమ్మకాన్ని చూసిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ బండి వెంకట్ రెడ్డిని పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు.

**గూడూరు :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజాదరణ సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు చిట్టి వెంకన్న ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి భారీగా తరలి వెళ్లారు. ఈ సభకు మొదటిసారి అధికారంలోకి కాంగ్రెస్ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నడంతో ప్రజలు వారి సంఖ్యలో వెళ్లారు. ఆయా గ్రామాల నుండి సుమారు పది వాహనాలు తరలి వెళ్లాయి.

## మతోన్మాద బీజేపీని ఓడించి...

**కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్ బాబు**

# లౌకిక ప్రజాస్వామ్య వాదులను గెలిపించాలి

నవతెలంగాణ -మరిపెడ



పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాదులను అధికారానికి దూరం పెట్టాలని వారిని ఓడించడమే సామాజిక శక్తులకు కర్తవ్యంగా పని చేయాలని, కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.స్కైలాబ్ బాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికలు సామాజిక శక్తుల కర్తవ్యం అనే అంశంపై విస్తృత స్థాయి సమావేశం మండలాధ్యక్షులు తప్పట్ల విజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలలో మనుస్మృతి శక్తులకు, రాజ్యాంగ శక్తులకు మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉందని, మనుస్మృతి వారసురాలుగా ఉన్న బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించడం ద్వారా రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. బిజెపి 10 ఏళ్ల పాలనలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దళితులు, మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందని, అన్ని రంగాల్లో దేశాన్ని అట్టడుగుకు చేర్చిన బిజెపి విధానాలు దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లు లేకుండా చేయాలని బిజెపి సర్కార్ యోచిస్తుందని తద్వారా సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందని విమర్శించారు. 2018లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అత్యాచార నిరోధక చట్టంను నీరు గార్చే కుట్రలు కుతంత్రాలు బిజెపి చేసిందన్నారు. దానికి వ్యతిరేకంగా తీవ్రమైన ప్రతిఘటన రావడంతో తోక ముడిచిందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మాట ఏమైందని ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. స్విస్ బ్యాంకులోని నల్లధనం వెలికి తీసి ప్రతి పౌరుడికి 15 లక్షల రూపాయలు ఇస్తామన్న మాట పదేళ్లలో ఎందుకు సాకారం చేయలేదని విమర్శించారు. ఏ పార్టీలో ఉన్న వాళ్ళందరూ ఆ పార్టీలోనే ఉంటూ బిజెపికి ఓటు వేయాలని మందకృష్ణ మాదిగ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. బిజెపికి ఎందుకు ఓటు వేయాలో మందకృష్ణ మాదిగ వైఖరి చెప్పాలన్నారు. బిజెపి ఓటమి భయంతోనే మూడు రాష్ట్రాల్లో పార్లమెంటు సీట్లకి పోటీకి పెట్టలేదని చెప్పారు. బిజెపిని ఓడించడమే లౌకిక ప్రజాస్వామ్యక శక్తులు ఐక్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య, మండలాధ్యక్షులు తప్పట్ల విజయ్, భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య, కేవీపీఎస్ మాజీ జిల్లా నాయకులు పాల్వాయి దుర్గయ్య, గంగుల వెంకటేష్, బొష్పంగు వికాస్, చర్మకారుల సంఘం మండలాధ్యక్షులు బాష్పంగి భిక్షం, వడ్లకొండ ఉప్పలయ్య, అనపర్తి ఉపేందర్, చింత వెంకటేష్, దాసరి వెంకన్న, కందుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీని ఓడించడమే కర్తవ్యంగా ముందుకు సాగాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

నవతెలంగాణ-మహబూబాబాద్

పదేళ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రజలకు చేసింది ఏమీ లేదని పరిస్థితులను మరింత దిగజార్చిందని రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కొరివి సీపీఎం కార్యాలయంలో ఎస్‌కె మాల్సుర్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను దారి మళ్ళించడానికి అయోధ్యలో రామ మందిరం పేరుతో మత రాజకీయాలు చేస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను తీసుకుని వచ్చి వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్‌లో కట్టబెట్టేలని మోడీ ప్రభుత్వం చేసిందని తెలిపారు.రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర ప్రధాని మోడీకి ఉందన్నారు. ఇప్పటికి రాజ్యాంగ విలువలను మంటగల్పుతున్న బిజెపి ఈసారి గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తుందని వారి ఆగడాల నిలువరించాలంటే ఎన్‌డిఏ కూటమి ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేసి కార్మిక హక్కులను హరించారని, జీఎస్టీలో రాష్ట్రాల పన్నుల వాటా తగ్గించారని, రాజ్యాంగ వ్యవస్థలను మోసం చేస్తుందని తెలిపారు. ఎన్ని దారుణాలకు పాల్పడుతున్న బీజేపీని తెలంగాణ రాష్ట్రంలో ఓడించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు, మండల కార్యదర్శి మాలేడి కోటయ్య పార్టీ నాయకులు నల్లపు సుధాకర్, పిట్టల వెంకన్న, జంగం ఉప్పాలయ్య, జక్కుల మల్లయ్య, కట్ల కృష్ణయ్య, పోతుగంటి మల్లయ్య, మాలోత్ కిషన్, గొల్లపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మంజూరైన సీసీ రోడ్లు తిరిగి వెంటనే నిర్మాణం చేపట్టాలి : మాజీ సర్పంచ్



**గార్ల :** మండలంలోని మద్దివంచ గ్రామ పంచాయతీలో గత అసెంబ్లి ఎన్నికల సందర్భంగా హడావిడిగా సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని మంజూరైన సిసి రోడ్లును తిరిగి వెంటనే నిర్మాణం చేపట్టాలని మాజీ సర్పంచ్ కుసిని బాబురావు కోరారు. మద్దివంచ గ్రామంలోని గౌని వీరయ్య భవనంలో శుక్రవారం జరిగిన న్యూ డెమోక్రసీ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బాబురావు మాట్లాడుతూ సిసిరోడ్లుకు సంబంధించిపంచాయతీ నుండి తీర్మానాలు తీసుకొని కొన్ని బజార్‌లలో రోడ్లు నిర్మాణం చేయడం జరిగిందని, మిగతా బజారులలో నిర్మాణం చేయకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చిందని ఎన్నికలు అయిపోయాక నిర్మాణం చేపడతామని చెప్పి ప్రజలను మభ్య పెట్టారని పంచాయతీలో డియంఎఫ్‌టి నిధుల కింద మంజూరైన సీసీ రోడ్లను నిర్మించాలని, పంచాయతీలో గత ఐదు సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది నాయకులు వారికి ఇష్టం వచ్చినట్లు పొలాలలో దారులకు ఇంటి చుట్టూ సిసి రోడ్లు నిర్మించుకుంటున్నారని, అంతర్గత రోడ్లు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలు, కొత్త తండాలో సిసి రోడ్లను వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నాయకులు గౌని భద్రయ్య గౌని మల్లేశం, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## విద్యా సేవకునికి వీడ్కోలు..

నవతెలంగాణ-మరిపెడ

ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని, విద్య వ్యవస్థలో పనిచేసే వారు సమాజంలో ఏప్పటికి గురువులుగానే కీర్తింపబడతారని కరీంనగర్, వరంగల్ ఆర్సీ డిస్ వెంకన్న అన్నారు. శుక్రవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కావేటి కృష్ణ కుమార్ పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడచిన 31 ఏళ్లుగా కృష్ణ విద్యావ్యవస్థలో ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చారని అన్నారు. విశాఖపట్నంలో ఉపాధ్యాయులుగా ప్రారంభం అయిన కృష్ణ ప్రస్థానం మహబూబాబాద్ జిల్లా మరిపెడలో ప్రిన్సిపాల్‌గా ముగిసిందన్నారు. ఇన్నేళ్ల తన ఉద్యోగ జీవితంలో ఒక్క మచ్చ కూడా లేదన్నారు. నేటి విద్యార్థులు, యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో విద్యని అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరాలని ఆకాక్షించారు. పాఠశాలలో విద్యార్థులకే కాదు ఆయన సమాజ సేవలోను అందరికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్సీ కుమార్, రిటైర్డ్ ఆర్సీలు మహేష్ సత్య నారాయణ, పలు జిల్లాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## 'కారు' దిగి కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ కార్యకర్తల అంతర్మథనం

**కొడకండ్ల :** పది సంవత్సరాలు మండలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు లేకుండా నియోజకవర్గానికి నాయకత్వం లేకున్నా మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్నచిన్న కిందిస్థాయి కార్యకర్తలు అక్కడక్కడ ఒకరు పార్టీని భుజస్కందాలపై వేసుకొని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పనిచేసిన కార్యకర్తలు టిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ కార్యకర్తలు అంతర్మథనంలో పడిపోయారు. గత మూడు నెలల కింద జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తే ఆసభలకు ప్రజలను తరలించేం దుకు సమాయత్తం చేస్తే చౌరస్తాల వద్ద సభలకు వెళ్లకుండా ప్రజల్ని ఆపిన టిఆర్‌ఎస్ నాయకులు మళ్లీ కాంగ్రెస్‌లో చేరడంతో గ్రామాలలో కాంగ్రెస్ పరిస్థితి ఏందని ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో గ్రామాలలో చిన్నచిన్న కార్యకర్తలను టిఆర్‌ఎస్ నాయకులు బెదిరింపులకు గురిచేసి ఆర్థికంగా మానసికంగా హింసల గురి చేశారని ఇప్పుడు వారు కాంగ్రెస్‌లో చేరితే పార్టీ పరిస్థితి ఏంటి అని కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. వీరి చేరికతో కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో లాభమా..? నష్టమా..? అనే కోణంలో ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

## పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జఫర్‌గడ్

శివాలయం ధ్వజస్తంభ పునః ప్రతిస్థాపన మహోత్సవ వాల్ పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో ఆలయాల కమిటీ చైర్మెన్ మంచాల ఎల్లయ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 22, 23, 24న ధ్వజస్తంభ పండుగలు జరుగుతాయని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తాటికాయల యాకయ్య, కోశాధికారి దాంశెట్టి సోమేశ్వర్, కమిటీ సభ్యులు పట్టపురి సంతోష్, జ్యోతి యాకయ్య, కన్న సోమేశ్వర్, అంజయ్య, నరసింగం, బై రవి, తాటికాయల రాజేందర్, పట్టపురి విజయ్, మెరుగు రాజు గౌడ్, రొడ్డ రాజు, మెరుగు సమ్మయ్య, తాటికాయల వరుణ్, పట్టపురికృష్ణ పాల్గొన్నారు.

## డీఈఓగా ఎంపికపై అభినందనలు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

జిల్లా ఇంటర్ విద్య అధికారి (డీఈఓ)గా కె.ఆంజనేయ రాజు ఎంపికపై శుక్రవారం డివిజన్ కేంద్రంలోని అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు రాజుకు డీఐఓగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర స్థాయి ఇంటర్మీడియట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో జీఆర్‌ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన రంజిత్ రెడ్డి

**స్టేషన్‌ఘనపూర్ :** నియోజక వర్గ కేంద్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన నియోజక వర్గ కో ఆర్డినేటర్, చిల్పూర్ మండల ఇంచార్జీ, సీనియర్ నాయకులు పోలేపల్లి రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజక వర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

**నవతెలంగాణ-మహదేవపూర్**



మండలంలోని కాలేశ్వరం అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. మహారాష్ట్ర-చత్తీస్‌గడ్ రాష్ట్రాలో ఎన్‌కౌంటర్లతో పాటు, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో తొలివిడత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మహారాష్ట్ర-తెలంగాణ రాష్ట్రాల రాకపోకలు కొనసాగిస్తున్న బస్సులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ఎస్సై భవానీసేన, సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రమైన గాయాలు

**నవతెలంగాణ-మల్హర్‌రావు**



రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రమైన గాయాలైన సంఘటన మండలంలోని కొయ్యుర్-కాటారం ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది.స్థానికుల పూర్తి కథనం ప్రకారం కాటారం నుంచి కారు మంథనికి వెళుతుండగా మంథని నుంచి భూపాలపల్లి వైపునకు వస్తున్న లారీ కొయ్యుర్ రోడ్డాం సమీపంలో లారీ కారును ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ రాజు కాలు, దవడ భాగాలకు తీవ్రమైన గాయలైయ్యాయి. సంఘటన స్థలానికి కొయ్యుర్ పోలీసులు చేరుకొని చికిత్స నిమిత్తం రాజును భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విచారణ అనంతరం కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లుగా కొయ్యుర్ ఎస్ఐ నరేశ్ తెలిపారు.



## ఖర్చులను పగడ్బందీగా నమోదు చేయాలి

**నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగా**

**నవతెలంగాణ-భూపాలపల్లి**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుళ ఖర్చులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా నమోదు చేయాలని వరంగల్ ఎస్సీ పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్‌సింగా తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన ధీరజ్ సింగా శుక్రవారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా ఐడీఓసీ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా ఎన్నికల నిర్వహణకు జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారాలను టెముల ద్వారా నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అన్ని టీంలు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద బ్యాంక్ ఖాతాలపై నిఘా ఉంచామని తెలిపారు. ఎస్‌ఎస్టి, వీఎస్టి, ఎఫ్ ఎస్ టి, అకౌంటింగ్ టీం అధికారులు విధుల నిర్వహణపై అవగాహన కల్పించి నిర్వహించాల్సిన విధులపై అవగాహన. కల్పించామని తెలిపారు. అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సి విజిల్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1950 కాల్ సెంటర్, గ్రీవెన్సు కమిటీ సెంటర్, మీడియా సెంటర్ ఏర్పాటు వివరాలను వివరించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగా మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, వీఎస్టీ బందాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఎంసీఎంసి ద్వారా చెల్లింపు వార్తలు (పెయిడ్ న్యూస్) ప్రకటనలకు, కరపత్రాలు, పోస్టర్లు తదితర ప్రచార సామాగ్రి యొక్క వ్యయాలను నమోదు చేయాలన్నారు. ఎంసిఎంసి కమిటీ ద్వారా ప్రతి రోజు దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్‌పై దష్టి సారించాలని సోషల్ మీడియాపై పటిష్ట నిఘా ఉండాలన్నారు.



## చత్తీస్‌గడ్‌లో జరిగినవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లే

**అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షులు అంజమ్మ**

**నవతెలంగాణ-చిట్యాల**

ఇటీవల చత్తీస్‌గడ్‌లో మావోయిస్టులపై పోలీసులు జరిపిన ఎదుర్కొల్పులు అన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లేనని అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షులు అంజమ్మ, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని చల్లగరిగే గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత సిరిపెల్లి సుధాకర్, రజిత దంపతుల అంతక్రియలో ఆమె పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విప్లవకారులను బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో హత్యలు చేయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్తబ్దుగా ఉన్న మావోయిస్టులపై పోలీసు అధికారులచే ఛత్తీస్గడ్ ప్రాంతంలోని ఆదివాసులతో మావోయిస్టులను టార్గెట్ చేసి వారికి విషపూరితమైన ఆహారాన్ని అందించి పట్టుకొని చిత్రహింసలు గురిచేసి హత్య చేయించిందని ఆరోపించారు. ఈ బూటకపు ఎన్కొంటర్లకు బీజేపీ ప్రభుత్వమే కారణమని అన్నారు. ఇటీవల మూడు నెలల కాలంలో సుమారు 70కిపైగా మావోయిస్టులను, వారికి సహకరిస్తున్న ఆదివాసీలను కాల్చి చంపారని ఆరోపించారు.



## వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన ప్రారంభం

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

మండల కేంద్రమైన తాడిచర్లలో ఆంజనేయ శివ పంచాయతన ఆలయంలో గణపతి, పార్వతి, శివుడు, సూర్యభగవనుడు, విష్ణు మూర్తిల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. శుక్ర, శని, ఆదివారం మూడు రోజుల పాటు ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వ హించనున్నారు. 19న శుక్రవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షా స్వీకారం, ఋత్విక్వర్ణనం, నవగ్రహ, యోగిని, వాస్తు క్షేత్రపాలక బ్రహ్మాది మండల పూజలు, అగ్నిప్రతిష్ట దేవతా హోమాలు విగ్రహాజలాధి వాసాలు నిర్వహించారు. ప్రతిష్టాపన సందర్భంగా నిర్వహించిన హోమం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, విగ్రహ పాలాభిషేకము, స్థాపిత దేవతా పూజలు, హోంమాలు, విగ్రహ ధ్యానఫల, పుష్ప శయ్యాధివాసాలు నిర్వహించ నున్నారు. ఆదివారం బ్రహ్మముహూర్తంలో లక్ష్మీనారాయణ హోమం గర్తన్యాసం, యంత్రప్రతిష్ట, విగ్రహప్రతిష్ట, దక్పులి, దిక్పులి, పూర్ణహూతి అనంతరము భక్తులకు దర్శనం కల్పించనున్నారు. తాడిచెర్ల ఆలయ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో ప్రతి రోజు అన్నదాన కార్యక్రమము నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## విద్యుత్‌కు అంతరాయం

**నవతెలంగాణ-మహదేవ్‌పూర్**

మండలంలోని కాళేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలోని పుస్కుపల్లి, మద్దులపల్లి, చంద్రుపల్లి, నాగెపల్లి గ్రామాల్లో శనివారం 11కేవీలైన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని, ప్రజలకు సహకరించాలని ఏఈ శ్రీకాంత్ కోరారు.

# పక్కా ప్రణాళికతో తాగునీటి సమస్యలను నివారించాలి

**అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

**నవతెలంగాణ-భూపాలపల్లి**



పక్కా ప్రణాళికతో త్రాగునీటి సమస్య లను నివారించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో తాగునీటి సమస్యల నివారణ, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పురోగతిపై మండలాల ప్రత్యేక అధికారులు ఎంపీడీవో, ఎపిఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 3నెలల పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పక్కా ప్రణాళికలతో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎండల తీవ్రత వల్ల నీటి నిల్వలు అడుగంటి పోయే అవకాశం ఉందని వెంటనే గుర్తించి ప్రత్యామ్నాయంగా వ్యవసాయ బోర్ల నుండి తాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ పైపు లైన్ ద్వారా నీరు సరఫరా చేసే క్రమంలో ఎక్కడైనా సాంకేతిక లోపం తలెత్తినా, పైపులు పగిలిపోవడం, గేట్ వాల్వ్ లీకేజీలు జరగడం లాంటివి జరిగినా గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టే విధంగా ఎంపిడిఓలు గ్రిడ్, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు కషిచేయాలని తెలిపారు. ఈ 3 నెలలపాటు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితి జఠిలం కాకముందే జాగ్రత్తలు చేపట్టాలని, అధికారులు అనునిత్యం గ్రామ పంచాయతీలలో క్రమం తప్పక పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులను గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని అన్నారు. సమస్య ఉంటే తన దష్టికి తీసుకురావాలనని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు మిషన్ భగీరథ, గ్రిడ్ ఇంజనీర్ లు పంచాయతీ కార్యదర్శులు సమన్వయ పరుచుకుంటూ త్రాగు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మన జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రానున్న రోజుల్లో మంచినీటి సమస్య క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షణ చేయాలన్నారు. హరితహారం మొక్కలు, గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై పాయింట్ టు పాయింట్ తెలిసి ఉండాలని అన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల గురించి మాట్లాడుతూ పాఠశాలల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను జాప్యం చేయకుండా పాఠశాలలు పున ప్రారంభం వరకు పూర్తి చేయాలన్నారు. 271 పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులు చేపట్టాల్సి ఉండగా 209 పాఠశాలలకు ఇంజనీరింగ్ అధికారులు అందచేసిన ప్రతి పాదనలు మేరకు పరిపాలనా అనుమతులు జారీ చేశామని, మిగిలిన 62 పాఠశాలల ప్రతిపాదనలు శనివారం వరకు అందచేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

పనుల పురోగతి పై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యా యులు నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేయుటకు మైక్రో లెవెల్ ప్రణాళిక రూపొందించి పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత లోపించకుండా చూడాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో ప్రతి విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసి ఉండాలని తెలిపారు. వీవోఏలకు అప్పగించిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లో రూపుదిద్దుకునే ప్రాముఖ్యత కలిగిన పనులని పకడ్బందీగా చేయాలని అన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పనుల్లో జాప్యం జరిగినా, నాణ్యత లోపించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని ప్రతి సోమవారం తనిఖీ చేయడం జరుగుతుందని పనుల్లో జాప్యం జరిగినా, నాణ్యత లోపించినా సంబంధిత ఎంపీడీవోలకు మెమోలు జారీ చేస్తామని అన్నారు. తక్షణమే ఎంపీడీవోల ఖాతా నుండి వివోఏ సంఘాల వారి అకౌంట్ లలో డబ్బులు జమ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, జెడ్పీసీఈవో విజయలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఈ.ఈ నిర్మల, డీఆర్‌డీఓ నరేష్, డీపీఓ నారాయణరావు, గ్రిడ్ ఈ.ఈ మాణిక్యారావు, విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పీఆర్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# తునికాకు సేకరణపై నీలినీడలు

**టెండర్లు పిలిచేందుకు అధికారులు నిరాసక్తత**

**మూడేళ్లుగా నిలిచిపోయిన వైనం**

**ఉపాధి కోల్పోయిన పేదలు**

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

పల్లె జనానికి ఆకుల రూపంలో కాసులు కురిపించే తునికాకు సేకరణపై నీలినీడలు కమ్ముకున్నాయి. టెండర్లకు గుత్తేదారులు ముందుకు రాకపోగా,బీడీలు చుట్టేందుకు ఆకులు పనికి రావని పారెస్ట్ అధికారులు మూడేళ్లుగా తునికాకు సేకరణకు టెండర్లు పిలవడం లేదని తెలుస్తోంది. ఒకప్పుడు వేసవిలో తునికాకు సేకరణతో పేదలు మంచి ఆదాయం పొందేవారు. నాలుగు మాసాల పాటు ఉపాది లభించేది. ప్రభుత్వానికి కూడా ఆదాయం సమకూరేది. అలాంటి తునికాకు సేకరణ పూర్తిగా మరుగున పడటంతో పేదలు ఉపాధి కొల్పోయారు.

మండలంలోని కొయ్యుర్ రేంజ్ పరిధిలో 14,170 హెక్టార్లు,దాదాపు 35వేల ఎకరాల దట్టమైన అడవి విస్తరించింది. వీటి పరిధిలో తాడిచెర్ల, మల్లారం, కిషన్‌రావుపల్లి, షాత్రజ్‌పల్లి, పెద్దతూండ్ల, కొయ్యుర్, ఎడ్లపల్లి, రుద్రారం, వల్లెంకుంట, శభాష్‌నగర్ తదితర బిట్ పరిధిల్లో టెండర్లు పిలిచేవారు. కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి టెండర్లను చేజిక్కించుకొని ఊరూరా తునికాకు కల్లాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో చాటింపు చేయించి ఆకు సేకరణకు పిలిచేవారు. ప్రతియేటా వేసవిలో మార్చి, ఏప్రిల్,మే, జూన్ మాసాల్లో జోరుగా ఆకు సేకరణ జరిగేది.ఆకు సేకరణలో అత్యంత ప్రధాన పాత్ర గిరిజనులదే. వీరి నివాస తండాలు అడవులకు దగ్గరగా ఉండడంతో తెల్లవారుజామునే అడవికి చేరుకొని ఆకు సేకరణలో నిమగ్నమైయ్యేవారు.



**2021వరకు సేకరణ...**

కొయ్యుర్ రేంజ్ పరిధిలో 2021వరకు తునికాకు సేకరణ జోరుగా సాగింది. దీంతో గ్రామీణ ప్రాంత పేదలకు చేతినిండా పని దొరికేది. కానీ ప్రస్తుతం టెండర్లు పిలవడం లేదు. చివరగా 2021 టెండర్ల ద్వారా ఒక యూనిట్ ఆకు సేకరణ మాత్రమే జరిగినట్లుగా పారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఒక్కొక్క ఎస్బిలో రూ.3లక్షల తునికాకు కట్టలు, ఒక కట్టలో 100ఆకులు ఉంటాయని అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఒక చెట్టు ఆకు తెంపితే 5నుంచి 8 కట్టలు లభిస్తుంది. ప్రస్తుతం ఒక తునికాకు కట్ట ధర మార్కెట్‌లో రూ.7 పలుకుతోంది. ఒక మహిళ నిత్యం 100కట్టల ఆకు సేకరణ చేయవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

# వనం వీడి జనంలోకి రావాలి

**మావోయిస్టు అగ్రనేతలకు పస్రా సీఐ, శంకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు సూచన**

**మావోయిస్టు దామోదర్ తల్లిని కలిసి నిత్యవసర సరుకులు అందజేత**

**నవతెలంగాణ-తాడ్వాయి**



కాలం చెల్లిన సిద్ధాంతాలతో మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న అగ్రనేతలు, సభ్యులు వనం వీడి జనంలోకి వచ్చి జనజీవన స్రవంతిలో కలువాలని పస్రా సీఐ శంకర్, తాడ్వాయి స్థానిక ఎస్సై ననిగంటి శ్రీకాంత్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలం కాల్వపల్లిలోని మావోయిస్టు పార్టీ అగ్రనేత, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బడే దామోదర్ తల్లి బడే బతుకమ్మను ఆమె నివాసంలో, జిల్లా ఎస్పీ శబరిస్ ఆదేశాల మేరకు సీఐ, ఎస్ఐలు పోలీసులతో కలిసి వచ్చి ఆమెను కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పోషణను అడిగి తెలుసుకుని బియ్యం, ఉప్పు, పప్పు, కారం, నూనె, సబ్బులు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల చతీస్గడ్‌లోని పరిణామాల దష్ట్యా వనం వీడి జనంలోకి రావాలని, వద్ధాప్యంలో ఉన్న వారి తల్లి బతుకమ్మ ఆదుకోవాలని కోరారు. పోలీస్ శాఖ నుండి అన్ని విధాల సహకారం ఉంటుందని తెలిపారు. వారికి మెరుగైన వైద్యం అందించి అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. అజ్ఞాతంలో ఉండి కన్న వారికి, తోబుట్టువులకు దూరంగా ఉంటూ మావోయిస్టు పార్టీ ఒత్తిడితో దళంలో కొనసాగుతున్నారని తెలిపారు. ముఖ్య నేతలందరూ అనారోగ్యంతో మతి చెందుతున్నా కేంద్ర కమిటీ దాటవేత ధోరణి ప్రదర్శిస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వివరించారు. జనజీవన స్రవంతిలో కలిసే ముఖ్య నేతలకు, కింది స్థాయి కేడర్‌కు పోలీస్ శాఖ ద్వారా అన్ని విధాలా సహకారం అందించడంతో పాటు వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా దామోదర్ తల్లి బతుకమ్మ 'ఒంటరిగా ఉండలేకపోతున్నాను ఇంటికి రా బిడ్డ నిన్ను చూడాలనిపిస్తుందని' అని కన్నీటి పర్యంతమయ్యారు. సీఐ ఎస్ఐలు ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారి వెంట స్థానిక పోలీసులు ఉన్నారు.

**శ్రీ నారాయణ హై స్కూల్‌లో**

## అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలు

**నవతెలంగాణ-గణపురం**



మండల కేంద్రంలోని శ్రీ నారాయణ హైస్కూల్‌లో శుక్రవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాలు జరిగాయి. అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక యంత్రంతో పాఠశాలకు వచ్చి అగ్నిమాపక చర్యలు, కిచెన్ గ్యాస్ సిలిండర్ అగ్ని ప్రమాదాల నివారణ గురించి వివరించారు. ముఖ్యంగా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. కాబట్టి, మనం శ్రద్ధ వహించాలని, అగ్నితో పోరాడాలని, మన కుటుంబ సభ్యులను, వీధిని రక్షించుకోవాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అగ్నిమాపక శాఖ పోలీసుల వద్ద మంటలను ఆర్పారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు పరిసరాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ధైర్యంగా తీర్చిదిద్దేందుకు శ్రీ నారాయణ హైస్కూల్ యాజమాన్యం ఇలాంటి గొప్ప కార్యక్రమాలను అందించడం అభినందనీయమన్నారు. ఎస్, కరస్పాండెంట్ ఎ భానుచందర్, ప్రిన్సిపాల్ ఎ స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొని తమ పాఠశాలలో వండర్ అవగాహన ఏర్పాటు చేసిన రవి, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఆపరేటర్ శంకర్, ఫైర్‌మెన్ కళ్యాణ్‌లను అభినందించారు.



## హాస్టల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఐటీడీఏ పీఓకు సీఐటీయూ వినతి**


**నవతెలంగాణ-ఏటూరునాగారం**

ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ కళాశాల అనుబంధ హాస్టల్స్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన 12 నెలల వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఔట్సోర్సింగ్ వర్కర్లు 12 నెలలు వేతనాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పీఓ దష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక శాఖలో పెండింగ్లో ఉన్న వేతనాల చెక్కును వెంటనే క్లియర్ చేయాలని కోరారు. డైలీ వేజ్ వర్కర్లకు రావాల్సిన ఐదు నెలల జీతాలు ఇవ్వాలని తెలిపారు. 30ఏండ్లుగా డైలీవేజ్ వర్కర్లుగా పనిచేసిన ఈ వర్కర్లను వీరికి తెలియకుండానే 2017లో ఔట్సోర్సింగ్ ఏజెన్సీ జీఎంఎస్‌కు అప్పగించారని అన్నారు. జీఎంఎస్ ఏజెన్సీ కార్మికులకు రావాల్సిన పీఎఫ్ 2017 నుండి 2021వరకు జమ చేయకుండా కాజేశాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ పనిచేస్తున్న కార్మికులను అవుట్సోర్సింగ్ నుంచి తగ్గించి డైలీ వెజ్ పద్ధతిలో యధావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బడే సులోచన,పద్మ, పోషాలు, స్వరూప, సుశీల, తారాబాయి, శాంత, సరోజన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## బలరాంనాయక్ గెలుపునకు కృషి చేయాలి

**కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి యానయ్య**

**నవతెలంగాణ-మంగపేట**



మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరామ్‌నాయక్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి కష్టపడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి రాష్ట్రంలో చేపట్టిన అభివద్ధి గురించి దశల వారిగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలను గూర్చి ప్రజలకు తెలియజేయాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జరిగే మార్పులు, అభివద్ధి గురించి వివరించి భారీ మెజారిటీతో బలరాంనాయక్‌ను గెలిపించుకోవాలని కోరారు. గ్రామాల్లో బూత్ లెవల్ నుంచి సమావేశాలు ఏర్పాటు చేసుకుని జిల్లా నాయకత్వం సూచనల మేరకు పనిచేయాలని కోరారు. బలరామ్ నాయక్ గెలుపు పార్టీ కార్యకర్తల పనితీరు పైనే ఆధారపడి ఉంటుందని కావున ఈ ఎన్నికల వేళ ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలని యానయ్య కోరారు.



## వడదెబ్బ పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

**నవతెలంగాణ-మహదేవపూర్**

ప్రస్తుత వేసవికాలంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామారావు అన్నారు. శుక్రవారం అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ల పరిధిలోని పలిమెల, మహాదేవపూర్ మండలాల్లోని అంబటిపల్లి, పెద్దంపేట గ్రామాలలో సూరారం సబ్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్‌తో కలిసి ఉపాధి హామీ కూలీలకు అంగడి ప్రదేశంలో కూరగాయల వ్యాపారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ సరిపడా నీరు తాగాలని, సూర్యరశ్మి నేరుగా శరీరంపై పడకుండా గొడుగు, టోపి, కళ్లద్దాలు, టవల్ తదితర వస్తువులను వినియోగించాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు సాధ్యమైనంత వరకు ఇంటిలోనే ఉండాలని సూచించారు. ఎండలో పనిచేయడం, ఆటలు ఆడటం చేయవద్దని సూచించారు. శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల కంటే ఎక్కువగా ఉండి అధిక చెమట రావడం, దాహం వేయడం, బలహీనంగా అనిపించడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మాశుక్ అలీ,హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎం సుజాత ఆశ వర్కర్ సుజాత పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**నవతెలంగాణ-మహదేవపూర్**

కాళేశ్వరం పీహెచ్‌సీ పరిధిలోని మెట్‌పల్లి గ్రామంలోశుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు వైద్యాధికారి డాక్టర్ డాక్టర్ సుస్మిత తెలిపారు. గ్రామంలోని వివిధ అనారోగ్య సమస్యల బారినపడిన వారికి మందులు పంపిణీ చేసి వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోహెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## కోటగుళ్లలో సైబర్ క్రైమ్ డీఎస్పీ పూజలు

**నవతెలంగాణ-గణపురం**

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో శుక్రవారం ములుగు సైబర్ క్రైమ్ డీఎస్పీ జిల్లా ఇన్చార్జి సందీప్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నరేష్ వారిని సాదరంగా ఆహ్వానించి అర్చన అభిషేకం నిర్వహించారు. అనంతరం డిఎస్పీకి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.